ఆదివారం
05-05-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 313
పేజీలు : 8+టాబ్లాయిడ్, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



మార్క్సిస్టు
మహామహోపాధ్యాయుడు
కార్ల్‌మార్క్స్
206వ జయంతి నేడు

డీబీటీ టెన్షన్!

- ఆసరా, విద్యాదీవెనపై ప్రభుత్వం దృష్టి
- ఈసీ నిర్ణయం కోసం ఎదురు చూపు
- కొనసాగుతున్న పెన్షనర్ల వెతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో తాజాగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) వ్యవహారం రాజకీయ పార్టీలను టెన్షన్‌కు గురిచేస్తున్నది. ఇప్పటికే సామాజిక పెన్షన్ల పంపిణీ సవ్యంగా జరగడం లేదు. ఒకటో తేదీన ఇవ్వాల్సిన పెన్షన్లు ఇంతవరకూ పూర్తిగా అవ్వా, తాతలకు దరిచేరలేదు. పెన్షన్ల దారులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అవస్థలకు గురవుతున్నారు. పెన్షన్లపై అధికార వైసీపీ, ఎన్‌డీఏ కూటమి పార్టీలు పరస్పరం విమర్శించుకుంటున్నారు. ఈ సమస్య ఇలాగే కొనసాగుతుంటే, ప్రభుత్వం అమలు చేస్తూ ఎన్నికల కోడ్‌తో ఆగిపోయిన పథకాల పంపిణీకి అవకాశం కల్పించాలంటూ రెండు వారాల క్రితం ఈసీకి ప్రభుత్వం లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ ఆసరా, విద్యా దీవెన, రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ, ఈబీసీ నేస్తం తదితర పథకాల డీబీటీకి అవకాశం కల్పించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. వాస్తవంగా ఎన్నికల కోడ్ రాగానే అన్ని పథకాలను ఈసీ నిలిపివేస్తుంది. అదే సమయంలో పెన్షన్ల పంపిణీ తరహాగానే ఈ డీబీటీ పథకాలకూ అనుమతివ్వాలని ప్రభుత్వం కోరింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆ పథకాల లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు చేరడం లేదని, నిరుపేదలైన లబ్ధిదారులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ లేఖలో తెలిపింది. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను యాజమాన్యం నిలిపివేస్తున్నదని వివరించింది. దీనిపై ఈసీ నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఎలాంటి స్పందన లేదు. ఈ పథకాలన్నిటికీ అనుమతిస్తే, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. డీబీటీ ద్వారా నిరుపేద లబ్ధిదారులకు పంపిణీ కాకుండా ఎన్‌డీఏ కూటమి పార్టీలు అడ్డుకుంటున్నాయంటూ తెరపైకి వైసీపీ నేతలు కొత్త పల్లవి తీసుకొచ్చారు. నిధులు విడుదల కాకుండా టీడీపీ, బీజేపీ అడ్డుపడుతున్నదని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఎన్‌డీఏ కూటమి పొత్తు అనంతరం ఆ పార్టీ నేతలు లాబీయింగ్‌కు పాల్పడి నిరుపేద పేదలకు డీబీటీ అందకుండా చూస్తున్నారని, పెన్షన్ల తరహాలోనే డీబీటీ నిధులను చంద్రబాబు అడ్డుకుంటున్నారని మండిపడుతున్నారు. ముఖ్యంగా రైతులు ఇబ్బందులు

- మిగతా 2 లో

'ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్' దుష్ప్రచారం...

సీఐడీ దర్యాప్తునకు ఈసీ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ల్యాండ్ టైటిలింగ్ యాక్టు విషయంలో టీడీపీ దుష్ప్రచారం చేస్తున్నట్లు అందిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ ఏపీ సీఐడీని లిఖిత పూర్వకంగా ఎన్నికల సంఘం ఆదేశించింది. తక్షణమే దీనిపై నివేదిక ఇవ్వాలని తెలిపింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఈ యాక్టుపై ఐవీఆర్ఎస్ కాల్స్‌తో టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఇటీవల వైసీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను అందజేశారు. టీడీపీ నేతల కనుసన్నల్లో ఈ ల్యాండ్ యాక్టు టైటిలింగ్ విషయంలో వైసీపీపై తప్పుడు కాల్స్‌తో దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. జనసేనకు చెందిన నటుడు పృథ్వీరాజ్ ఒక యూట్యూబ్ ఛానల్ ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని వివరించారు. ఈ ఫిర్యాదుపై ఎన్నికల సంఘం స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ సీఐడీకి తెలిపింది. దీంతో ఏయే ఏజెన్సీల నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయనే దిశగా సీఐడీ సైబర్ సెల్ విభాగం దర్యాప్తునకు సిద్ధమైంది.

రూపకల్పన దశలోనే ఉంది: సజ్జల

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ఇంకా రూపకల్పన దశలో ఉందని, అమల్లోకి తేలేదని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. విజయవాడలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు వికృత ధోరణితో వ్యవహరిస్తున్నారని, భూ సంస్కరణలను జీర్ణించుకోలేక

- మిగతా 2 లో

జంగాల, మురళి విజయం కోసం రోడ్‌షోలు

గుంటూరు పార్లమెంటు సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, తిరుపతి అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి పి.మురళి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం గుంటూరు, తిరుపతిలో భారీ రోడ్‌షో, బహిరంగ సభలు జరిగాయి. గుంటూరులో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, తిరుపతిలో రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు.

వివరాలు లోపలి పేజీల్లో.. ▸▸

నేడు నీట్ పరీక్ష

నిమిషం ఆలస్యమైనా
నో ఎంట్రీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 5న నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఆదివారం (మే 5న) మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.20 గంటల మధ్య పరీక్ష నిర్వహిస్తారు. ఇప్పటికే అడ్మిట్ కార్డులు విడుదల చేసిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పరీక్ష నిర్వహణకు అన్ని సన్నాహాలు పూర్తి చేసింది. ఈ పరీక్షకు 23,81,833 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు కాకుండా ఈ పరీక్ష మొత్తం 13 భాషలలో పెన్,పేపర్ విధానంలో నిర్వహిస్తున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రతి ఏడాది ఈ పరీక్ష నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అభ్యర్థులు పరీక్ష మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఉదయం 11:30 నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉంటుంది. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు వెంట తీసుకురావలసి ఉంటుంది.

ముస్లిం రిజర్వేషన్లు ఉండాల్సిందే

- ఎంతవరకైనా పోరాడతా
- సీఏఏ, ఎన్ఆర్‌సీపై ముస్లింలకు అండగా నిలిచాం
- వ్యతిరేకిస్తున్న బీజేపీతో చంద్రబాబు దోస్తీనా?
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గొప్ప సంస్కరణ
- ఎన్నికల సభల్లో సీఎం వైఎస్ జగన్

విశాలాంధ్ర-నెల్లూరు/హిందూపురం/పలమనేరు: ముస్లిం రిజర్వేషన్లపై టీడీపీ అధినేత చంద్రబాబుకు సీఎం వైఎస్ జగన్ సవాలు విసిరారు. నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెబుతున్న బీజేపీతో టీడీపీ అధినేత చంద్రబాబు జతకట్టారని అన్నారు. ఒకవైపు ఎన్డీయేలో కొనసాగుతూనే... మైనార్టీల ఓట్ల కోసం దొంగ ప్రేమ నటిస్తూ

- మిగతా 2 లో

అంజాన్‌కు కడపటి వీడ్కోలు

- వివిధ పార్టీల నేతల శ్రద్ధాంజలి
- వేలాది మంది నివాళి

లక్నో: అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి, సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్‌కు వేలాది మంది అశ్రునయనాలతో కడపటి వీడ్కోలు పలికారు. తమ సమస్యల పరిష్కారానికి అవిరళ కృషి చేసిన నాయకుడు ఇకలేడనే విషయం జీర్ణించుకోలేని రైతు, కార్మిక, కష్టజీవులు, పేద, మధ్యతరగతి వర్గాలు కన్నీరుమున్నీరయ్యాయి. అంజాన్ భౌతికకాయంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అరుణపతాకాన్ని, ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య రైతు సంఘం పతాకాన్ని కప్పి, పూల గుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, సీపీఐ జాతీయ కార్యదర్శులు పల్లవ్‌సేన్ గుప్తా, రామకృష్ణ పాండా, కార్యవర్గ సభ్యులు అనీ రాజా, గిరీశ్ శర్మ, రాజ్యసభ సభ్యులు సంతోశ్ కుమార్, ఏఐకేఎస్ (సీపీఎం) ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, సమాజ్‌వాదీ, కాంగ్రెస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

జగన్‌ను ఆదరిస్తే ఆత్మహత్యలే

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజలకు ముప్పు
- ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కాపాడతా
- దర్శి, నూజివీడు సభల్లో చంద్రబాబు

2 లో

ఎన్నికల్లో జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేస్తే ప్రజలు ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధిని భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని టీడీపీ, జనసేన, బీజేపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

అగ్నిగుండం!

ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

- ఎండవేడిమి, వడగాడ్పులతో బెంబేలు
- శీతలపానీయాలతో సేద
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 47 డిగ్రీల నమోదు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా అగ్నిగుండంగా మారింది. జిల్లాలో శనివారం ఉష్ణోగ్రత 47 డిగ్రీలు నమోదైంది. రెండు రోజులుగా సూర్యుడు చండప్రచండుడుగా మారాడు. ఎండ వేడిమికి ప్రజలు విలవిలలాడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, జంతువులు, పక్షుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఎండ వేడిమి తట్టుకోలేక శుక్రవారం మంత్రాలయ నియోజకవర్గం మాధవరంలో ఇద్దరు

- మిగతా 2 లో

నిజ్జర్ హత్య కేసులో

ముగ్గురి అరెస్టు

నిందితులు భారత సంతతికి చెందినవారే

ఫొటోలు విడుదల చేసిన కెనడా పోలీసులు

ఒట్టావా: ఖలిస్థానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో నిందితులుగా పేర్కొంటూ శుక్రవారం కెనడా పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. నిజ్జర్‌ను హత్య చేయడానికి భారత ప్రభుత్వం నియమించిన హిట్‌స్క్వాడ్‌లో సభ్యులుగా అనుమానిస్తూ ఎడ్మంటన్ ప్రాంతంలో నివసిస్తున్న కరణ్‌ప్రీత్

- మిగతా 2 లో

రైతు ఉద్యమ నిర్మాణంలో అంజాన్ పాత్ర కీలకం

కొనియాడిన ఎస్‌కేఎం

న్యూదిల్లీ: అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి, సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ మృతి పట్ల సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

'ఎస్కేఎం దాని వ్యవస్థాపక నాయకులలో ఒకరిని కోల్పోయింది. కేంద్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సమస్యల ప్రాతిపదికన ఐక్య ఉద్యమానికి ఎల్లవేళలా అంజన్ అండగా నిలిచారు. అన్ని వర్గాల ప్రజల హక్కులను సాధించేందుకు, కాపాడేందుకు పోరాడుతున్న వారందరికీ ఆదర్శంగా నిలిచారు.

విద్యార్థి కార్యకర్తగా ఉండగా ప్రజల దృష్టిని ఆకర్షించారు. లక్నో యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడయ్యారు. ఆ తరువాత రైతు ఉద్యమానికి మార్గదర్శక నాయకులలో ఒకరిగా రైతులు, కార్మికుల ఐక్య ఉద్యమానికి కరదీపికగా నిలిచారు. ఎంఎస్‌పీ సి2+50% డిమాండ్‌ను రూపొందించడంలో దివంగత ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటైన రైతుల జాతీయ కమిషన్ సభ్యుడిగా ఎనలేని సహకారం అందించారు. ఎస్కేఎం పేరిట అనేత రైతుసంఘాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి అతిపెద్ద సంఘాన్ని నిర్మించారు. భారతదేశం అంతటా రైతుల్లో దీనిని ఒక నిర్దిష్ట డిమాండ్‌గా మలచడానికి ఇతర భావ సారూప్య సంస్థలతో కలిసి పనిచేశారు.

2015 భూసేకరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా భూమి అధికార్ ఆందోళన్ (బీఏఏ)తో కలిసి, 2017లో చట్టబద్ధంగా అన్ని పంటలకు ఎంఎస్‌పీ (సి2+50%), సమగ్ర రుణమాఫీ చేయాలన్న రెండు ప్రధాన డిమాండ్లపై ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ సమితి (ఏఐకేఎస్‌సిసి) తో కలిసి రైతులను ఐక్యం చేయడంలో, 2020లో మూడు కార్పొరేట్ అనుకూల వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సంయుక్త్ కిసాన్ మోర్చా ఏర్పాటు చేయడంలో అంజన్ కీలక పాత్ర పోషించారు" అని ఎస్కేఎం తన ప్రకటనలో కొనియాడింది.

రేపు రాష్ట్రానికి మోదీ

వేమగిరిలో బహిరంగసభ

ట్రాఫిక్ ఆంక్షలు అమలు : డీజీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 6,8 తేదీల్లో ఏపీలోని వివిధ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని వేమగిరిలో కూటమి ఏర్పాటు చేస్తున్న బహిరంగసభలో ఆయన ప్రసంగిస్తారు. అదేరోజు సాయంత్రం 5.55 గంటలకు అనకాపల్లి సభలో పాల్గొంటారు. 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అన్నమయ్య జిల్లా పీలేరు సభలో పాల్గొంటారు. అక్కడ నుంచి విజయవాడలో సాయంత్రం 5గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు సుమారు 2.5 కిలోమీటర్ల పొడవున రోడ్ షో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పాల్గొంటున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు...

రాజమహేంద్రవరం కడియం మండలం వేమగిరి నేషనల్ హైవే పక్కన గల మైదానంలో ప్రధాని మోదీ బహిరంగసభను పురస్కరించుకుని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల మళ్లింపు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆయా జిల్లాల ఎస్పీలను ఆదేశించారు. ఆ మేరకు సోమవారం వాహనాల మళ్లింపు ఇలా ఉండనుంది.

విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు...

గుండుగొలను వైపుగా వచ్చే వాహనాలు నల్లజర్ల- దేవరపల్లి- గామన్ బ్రిడ్జ్ మీదుగా విశాఖపట్నం, తాడేపల్లిగూడెం వైపుగా వచ్చే వాహనాలు నల్లజర్ల- దేవరపల్లి- గామన్ బ్రిడ్జ్ మీదుగా విశాఖ వెళ్లాల్సి ఉంటుంది. జొన్నాడ వైపుగా వచ్చే వాహనాలను మండపేట- రామచంద్రపురం- కాకినాడ- కత్తిపూడి మీదుగా మళ్లిస్తారు.

విశాఖపట్నం వైపు నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు... కత్తిపూడి వైపుగా వచ్చే వాహనాలు పిఠాపురం- కాకినాడ- రామచంద్రపురం- జొన్నాడ మీదుగా, జగ్గంపేట మీదుగా వెళ్లే వాహనాలు సామర్లకోట- కాకినాడ- రామచంద్రపురం- జొన్నాడ మీదగా విజయవాడ వెళ్లాలని సూచించారు.

జిల్లా పరిసర ప్రాంతాలలో వేమగిరి మీదుగా వచ్చి వెళ్లే వాహనాలు

జీరో పాయింట్- గామన్ బ్రిడ్జ్- దేవరపల్లి మీదుగా విజయవాడకు, జీరో పాయింట్- గామన్ బ్రిడ్జ్- కొవ్వూరు- విజ్జేశ్వరం- పెరవలి- రావులపాలెం.. రాజానగరం- ద్వారపూడి- మండపేట- ఆలమూరు- జొన్నాడ- రావులపాలెం మీదుగా విజయవాడకు, వేమగిరి- ధవళేశ్వరం- ఐఎల్‌టీడీ జంక్షన్- కోటిపల్లి బస్టాండ్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. వేమగిరి- కేశవరం- ద్వారపూడి- మండపేట- రామచంద్రపురం మీదుగా కాకినాడ, పెరవలి జంక్ష-సమిశ్ర గూడెం-విజ్జేశ్వరం- కొవ్వూరు- గామన్ బ్రిడ్జి మీదగా వెళ్లాలని, వాహన యజమానులు ట్రాఫిక్ మళ్లింపులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అంజాన్‌కు కడపటి వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

బ్లాక్ తదితర పార్టీల నాయకులు అంజాన్ భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు ఉంచి నివాళులర్పించారు. రైతు, పేద, మధ్యతరగతి ప్రజల సమస్యల పరిష్కారానికి అంజాన్ చేసిన అవిశ్రాంత కృషిని ఈ సందర్భంగా మననం చేసుకున్నారు. గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న అతుల్ కుమార్ అంజాన్ గురువారం రాత్రి పొద్దుపోయిన తరువాత లక్నోలోని ఆసుపత్రిలో మృతి చెందిన విషయం తెలిసిందే. అంజాన్ భౌతికకాయాన్ని శనివారం ఉదయం ఆసుపత్రి నుంచి ఆయన ఇంటి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ కొంత సేపు ఉంచి కుటుంబ సభ్యులు నివాళి అర్పించిన తరువాత ఉదయం 10 గంటలకు ఇక్కడి సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి తరలించి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంచారు. అక్కడ సీపీఐ, సీపీఎం, సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, ఇతర రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అంజాన్ బంధుమిత్రులు, అభిమానులు, సన్నిహితులు వేలాది మంది భౌతికకాయాన్ని సందర్శించి తమ అభిమాన నాయకుడికి నివాళు లర్పించారు. అతుల్ కుమార్ అంజన్ అమరరహే, అమరరహే, సాధిస్తాం అంజాన్ ఆశయాలు, రెడ్ శాల్యూట్ అంజాన్ అన్న నినాదాలతో సీపీఐ కార్యాలయం మారుమోగింది. ఈ సందర్భంగా అంజాన్ సేవలను వారు గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం దేశంలో రైతు ఉద్యమానికి, వామపక్ష ఉద్యమానికి తీరనిలోటుగా పేర్కొన్నారుఅరవై ఏళ్లు పైబడిన రైతులకు పెన్షన్ రావడం అతుల్ కృషేనని గుర్తుచేసుకున్నారు. మూడు వ్యవసాయ దుష్ట చట్టాలు రద్దు చేయాలని కొన్నివందల రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో జరిగిన మహత్తర పోరాటంలో అతుల్ ప్రముఖపాత్ర నిర్వహించారన్నారు. వేలాది మంది అశ్రు నయనాల మధ్య మధ్యాహ్నం 3 గంటలకు అంజాన్ భౌతికకాయాన్ని లక్నోలోని విద్యుత్ శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉన్న కారణంగా అంతిమయాత్ర, సంతాప సభ నిర్వహించలేకపోయారు.

జగన్‌ను ఆదరిస్తే ఆత్మహత్యలే

విశాలాంధ్ర-దర్శి/నూజివీడు : ఈ ఎన్నికల్లో జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేస్తే ప్రజలు ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధిని భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని టీడీపీ, జనసేన, బీజేపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం చంద్రబాబు ప్రకాశం జిల్లా దర్శి, ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన సభల్లో ప్రసంగించారు. తాము అధికారంలోకి వస్తే ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను కాపాడతామని, బీసీలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. దర్శిలోని పొదిలి రోడ్డులో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రమాదకరమైందని, ప్రజల ఆస్తిపై ఒక ప్రైవేటు కంపెనీకి హక్కులు ఉండే విధంగా చట్టం రూపకల్పన చేశారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని ప్రకటించారు. టీడీపీ హయాంలో కొనసాగిన విద్యా దీవెన, బీసీలకు ఆదరణ, పంట రాయితీలు వంటి మంచి పథకాలను రద్దు చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే మరింత మెరుగైన మంచి పథకాలను ప్రవేశపెడతామని తెలిపారు. మసీదుల్లో పనిచేసే వారికి రూ.20 వేల గౌరవ వేతనం ఇస్తామని, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, అలాగే వృద్ధులు, దివ్యాంగులకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని, ఏప్రిల్ నుంచి ఈ పెంపు బకాయిలను కలిపి జూన్ నెలలో లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్‌ను పునరుద్ధరిస్తామన్నారు. గోదావరి, కృష్ణా జలాలను నాగార్జునసాగర్ కాలువల ద్వారా భూములకు అందిస్తామని తెలిపారు. తాళ్లూరు మండలానికి ప్రయోజనం చేకూర్చే మొగిలి గుండాల రిజర్వాయర్ ప్రాజెక్టుని తెలుగుదేశం హయాంలో ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. దోపిడీలు, హత్యలు, ఆక్రమణలు, స్మగ్లింగ్ వంటివి జగన్ నవరత్నాలని ఎద్దేవా చేశారు. గొట్టిపాటి లక్ష్మీ ధైర్యం ఉన్న మహిళ అని, మంచి వైద్యురాలని ఆమెను గెలిపించుకోవాలని కోరారు. ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ, మాజీ శాసనసభ్యులు నారపు శెట్టి పాపారావు, పంచాయతీ చైర్మన్ నారపు శెట్టి పిచ్చయ్య, దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గోరంట్ల రవికుమార్, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు పమిడి రమేష్, కడియాల లలిత సాగర్, కడియాల రమేష్, కడియాల వెంకటేశ్వరరావు, మాగుంట రాఘవరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌కు ప్యాలెస్‌లు... పేదలకు పూరిళ్లా?

నూజివీడులో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. జగన్‌కు అభివృద్ధి తెలియదని, విధ్వంసమే తెలుసని విమర్శించారు. భూగర్భ వనరులు దోచుకున్నారని మండిపడ్డారు. 'నూజివీడు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని చాలా రోజులుగా పోరాడుతున్నారు. మీ కోరిక తప్పకుండా నెరవేరుస్తా. జగన్‌కు ప్యాలెస్‌లు, ప్రజలకు మాత్రం పూరిళ్లా? ఇదెక్కడి న్యాయం. అధికారంలోకి రాగానే పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం. డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తాం. మొదటి సంతకం మెగా డీఎస్సీపై, రెండో సంతకం ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు రద్దుపైనే. మన భూములపై జగన్ అజమాయిషీ ఏంటి? ప్రజల పాసు పుస్తకాలపై ఆయన ఫొటో ఎందుకు?' అని చంద్రబాబు ప్రశ్నించారు.

డీబీటీ టెన్షన్!

(మొదటిపేజీ తరువాయి)

పడుతున్నారని పేర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం రెగ్యులర్‌గా అమలు చేస్తున్న పథకాలను ఈసీ అడ్డుకునే అవకాశం లేదని వైసీపీ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పెన్షనర్ల డబ్బులో కోత

పెన్షనర్ల డబ్బును బ్యాంకుల్లో జమ చేయడంతో సర్‌చార్జీల పేరుతో కోత విధిస్తున్నారు. వచ్చే రూ.3 వేల పెన్షన్ తగ్గిపోవడంతో వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. చాలా జిల్లాల్లో పెన్షనర్లు బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65.49 లక్షల మంది పెన్షన్ దారులున్నారు. వారిలో 48.92 లక్షల మందికి బ్యాంకు ఖాతాలున్నాయని ప్రభుత్వ అధికారులు ప్రకటించారు. పెన్షన్ దారుల ఖాతాలు లావాదేవీలు జరగలేదని, మినిమం బ్యాలెన్స్ లేవని ఇతర కారణాలు చెప్పి రూ.400 ఆపైన చార్జీలు వసూలు చేస్తున్నారు. పెన్షన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాజకీయ పార్టీలు సూచించినప్పటికీ, ప్రభుత్వ నిర్లక్ష్యంతో వృద్ధులు చనిపోయారు. వలంటీర్లు ఉన్నప్పుడు పెన్షనర్లకు సమస్య తలెత్తలేదని అధికార పార్టీ నేతలు వాదిస్తున్నారు. అయితే సచివాలయాల పరిధిలో ఉన్న సిబ్బందితో పెన్షన్లను ఇంటింటికీ ఎందుకు పంపిణీ చేయడం లేదంటూ టీడీపీ, బీజేపీ, జనసేన ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారారని మండిపడుతున్నాయి. ఈ మేరకు పెన్షనర్ల పంపిణీపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి టీడీపీ అధినేత చంద్రబాబు ఘాటుగా లేఖ రాశారు. అధికార పక్షానికి సీఎస్ అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆ లేఖలో విమర్శించారు. పెన్షన్ల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ముస్లిం రిజర్వేషన్లు ఉండాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

డ్రామాలు మొదలుపెట్టారని ఆరోపించారు. ఇంతకంటే ఊసరవెల్లి రాజకీయాలు ఎక్కడైనా ఉంటాయా? అని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ నెల్లూరు నగరంలో నిర్వహించిన సిద్ధం సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. వెనుకబాటుకు గురైన వారి రిజర్వేషన్లు తొలగించడం కరెక్టేనా అని ప్రశ్నించారు.

తాము ముస్లిం రిజర్వేషన్లను కొనసాగిస్తామని ఏపీ సీఎం వైఎస్ జగన్ తెలిపారు. ఆరు నూరైనా.. నూరు ఆరైనా మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు ఉండాల్సిందేనని జగన్ స్పష్టం చేశారు. దీనికోసం ఎంతవరకైనా పోరాడతానని చెప్పారు. ముస్లిం రిజర్వేషన్లపై మోదీ సభలో చంద్రబాబు మాట్లాడగలరా? అని ప్రశ్నించారు. రిజర్వేషన్ల కోసం ఎన్డీయే నుంచి బయటకు రాగలరా అని నిలదీశారు. తాము ముస్లింలకు మతప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వలేదని చెప్పారు. పేదరికం, వెనుకబాటు తనం అధారంగానే 4శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ అంశాల్లో కూడా ముస్లిం సామాజిక వర్గానికి మద్దతుగా నిలిచామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన సభలో జగన్ మాట్లాడుతూ... చంద్రబాబుకు ఓటేస్తే సంక్షేమ పథకాలన్నీ ముగిసిపోతాయని పేర్కొన్నారు. మరో 9 రోజుల్లో ఎన్నికల కురుక్షేత్రం జరగబోతుంది... ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను మాత్రమే ఎన్నుకునేందుకే కాదు... రాబోయే 5 ఏళ్ల మీ ఇంటింటి భవిష్యత్తును, పథకాల కొనసాగింపును నిర్ణయించబోయే ఎన్నికలు అన్నది ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా... ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల కుటుంబాల కోసం బటన్లు నొక్కి వారి బ్యాంకు ఖాతాలలో వేయడం అన్నది గతంలో ఎప్పుడైనా జరిగిందా అని ప్రశ్నించారు. ఏకంగా 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసి... మళ్లీ ప్రజల ఆశీస్సులు కోరుతున్నామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై మాట్లాడుతూ... ఈ చట్టంపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసే ప్రయత్నం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది రాబోయే రోజుల్లో గొప్ప సంస్కరణ అవుతుందని చెప్పారు. భూ వివాదాల వల్ల రైతులు, ప్రజలందరూ కూడా అధికారులు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉందని జగన్ గుర్తు చేశారు. ప్రజలు ఎవరూ కూడా ఎవరి చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి రాకూడదని అభిప్రాయపడ్డారు. ఈ భూములపై ఎలాంటి వివాదం లేదని ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా పలమనేరు బహిరంగసభలో మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ చూడని విధంగా ఆసరా, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఇళ్ల పట్టాలు.. అవ్వాతాతలకు ఇంటికే పెన్షన్ కానుక, రైతు భరోసా, ఉచిత బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పగటి పూట 9గం. ఉచిత కరెంట్.. ఇవన్నీ గతంలో ఎప్పుడైనా జరిగాయా? అని అడిగారు. వాహన మిత్ర, నేతన్నలకు నేస్తం, చేదోడు, లాయర్లకు లా నేస్తం, ఫ్యామిలీ క్లినిక్, విలేజ్ డాక్టర్, ఇంటికే సురక్ష, వలంటీర్ వ్యవస్థ, ఆర్బీకే, విలేజ్ క్లినిక్, మహిళా పోలీస్ ఇలాంటి ఎప్పుడైనా చూశారా అన్నారు. కేవలం 59 నెలల పాలనలో ఇచ్చిన హామీలన్నీ 99 శాతం అమలు చేసి ఎన్నికల ప్రచారంలో మరోసారి ఆశీర్వదించమని కోరుతున్నానన్నారు. తన పాలనలో సంక్షేమ పథకం ద్వారా ఏ కుటుంబానికైనా లబ్ధి చేకూరింటే తిరిగి మరోసారి ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకోమని విజప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్ సభలకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు.

అగ్నిగుండం!

(మొదటిపేజీ తరువాయి)

అన్నదమ్ములు సుంకన్న (65) ఆంజనేయులు (52) మృతి చెందాడు. ఉదయం 10 గంటల నుంచే రోడ్డు సెగలు కక్కుతుండడంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరం అయితే తప్ప ప్రజలు రోడ్డుపైకి రావాలంటే భయపడుతున్నారు. కర్నూలు నగరంలో కర్ఫ్యూను తలపించేలా రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. డోన్ పట్టణంలో శుక్రవారం ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్‌లు కూడా వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయినట్లు తెలిసింది. ఎండ తీవ్రతతో పాటు వడగాడ్పులు వీస్తుండటంతో ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు కొందరు కొబ్బరి బోండం ఖరీదును రూ.60 పెంచి విక్రయిస్తున్నారు. చెరకురసం, కూల్‌డ్రింక్స్, మజ్జిగ, లస్సీ, ఐస్‌క్రీంలు, తాటి ముంజలపై ప్రజలు ఎక్కువ మక్కువచూపుతున్నారు. ఫ్యాన్ వేడికి తట్టుకోలేక ప్రజలు ఏసీ, కూలర్‌లను ఆశ్రయిస్తు సేదతీరుతున్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వారికి పార్టీ కార్యాలయాల వద్ద కూలర్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా మజ్జిగ ఏర్పాటు చేస్తున్నారు.

రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయని నానుడి. రోహిణి కార్తె వచ్చేందుకు మరో 15 రోజులు సమయం ఉంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రోహిణీలో పరిస్థితి ఏమిటని ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. వర్షం కురిసి వాతావరణంలో మార్పు వస్తే తప్ప ప్రజలు కొద్దిమేర ఉపశమనం పొందే అవకాశం ఉంది. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముఖ్యకూడళ్లలో ఆర్టీసీ, మార్కెట్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తే ప్రయాణికులు అనారోగ్యంబారిన పడకుండా ఉంటారన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ రోజు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద చలువ పందిళ్లు, ఓఆర్ఎస్, మజ్జిగ, మంచినీటి ఏర్పాట్లు చేయాల్సిన అవసరముందని అంటున్నారు. గతంలో 42 డిగ్రీలు వస్తే ఇదే ఎక్కువగా భావించే వారమని ఇప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉందని ప్రజలు అంటున్నారు.

సీఐడీ దర్యాప్తునకు ఈసీ ఆదేశం

(మొదటిపేజీ తరువాయి)

పోతున్నారని మండిపడ్డారు. సమగ్ర భూ సర్వే జరిగాకే, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమలులోకి వస్తుందన్నారు. ఈలోగా ప్రజల నుంచి అభ్యంతరాలను తీసుకుంటామని, గ్రామ సభలు నిర్వహిస్తామని చెప్పారు. దీనిపై 6వేల గ్రామాల్లో సమగ్ర సర్వే జరిగిందని వివరించారు. ఈ చట్టం అమలు కావడానికి ఇంకా మూడేళ్లు పట్టవచ్చుని, భూ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఈ యాక్ట్ దోహదపడుతుందని చెప్పారు.ఈ చట్టం అమలులోకి వస్తే భూ కబ్జాలు చేసే వారికి ఆందోళన తప్పదన్నారు. నాడు చంద్రబాబు హయాంలో నకిలీ స్టాంప్‌ల కుంభకోణం జరిగిందని గుర్తుచేశారు.

నిజ్జర్ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

సింగ్ (28), కమల్‌ప్రీత్ సింగ్ (22), కరణ్ బ్రార్ (22)లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తాజాగా వారి ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. అయితే వీరందరూ భారత సంతతికి చెందినవారని రాయల్ కెనేడియన్ మౌంటెడ్ పోలీసులు (ఆర్‌సీఎమ్‌పీ) ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆర్‌సీఎమ్‌పీ అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ టెబౌల్ మీడియాతో మాట్లాడుతూ... నిజ్జర్ హత్య దార్యాప్తు వేగంగా జరుగుతోందని వెల్లడించారు. "నిజ్జర్ హత్యలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి అభియోగాలు మోపారు. అయితే సాక్ష్యాధారాల స్వభావంపై మేం ఎలాంటి వ్యాఖ్యలు చేయదలచుకోలేదు. అలాగే నిజ్జర్ హత్య వెనుక ఉన్న ఉద్దేశం గురించి కూడా మాట్లాడలేం. ఈ విషయంలో దర్యాప్తు మాత్రం చాలా క్రియాశీలకంగా జరుగుతుందని చెప్పగలను. ఈ విషయాలపై ప్రత్యేక, విభిన్నమైన దర్యాప్తులు కొనసాగుతున్నాయి. అది ఈరోజు అరెస్టయిన వ్యక్తుల ప్రమేయానికి మాత్రమే సంబంధించినది కాదు. భారత ప్రభుత్వ ప్రమేయంపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది" అని డేవిడ్ టెబౌల్ తెలిపారు. అయితే నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వం హస్తం ఉందా లేదా అనే విషయాన్ని కెనడా హోంమంత్రి డొమినిక్ లెబ్లాంక్ నిర్ధరించలేదు. కానీ అలాంటి విషయాల్లో దర్యాప్తును ఆర్‌సీఎంపీకి అప్పగించాలని చెప్పారు. "కెనడా ప్రభుత్వ భద్రతా యంత్రాంగం, ఆర్‌సీఎంపీ, సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ చేసే పనిపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. ఈ పోలీసుల చర్యను బట్టి చూస్తే, ఈ కేసును ఆర్‌సీఎంపీ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది" అని డొమినిక్ అన్నారు. కాగా నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉన్నట్లు కెనడియన్ మీడియాలో వస్తున్న ఊహాగానాలపై పోలీసులు ఎలాంటి ఆధారాలు బయటపెట్టలేదు. ఈ ఆరోపణలను భారత్ పదే పదే ఖండిస్తోంది. కాగా కెనడా అరెస్టు చేసిన ముగ్గురికీ పాక్ ఐఎస్ఐతో సంబంధాలున్నట్లు సమాచారం.

ఇదీ కేసు...

2023 జులై 18న బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో ఓ గురుద్వారా వెలుపల నిజ్జర్ హత్య జరిగింది. నిజ్జర్ హత్యలో భారత్ ఏజెంట్ల పాత్ర ఉందంటూ కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో ఆరోపించారు. దీంతో రెండు దేశాల మధ్య విభేదాలు తలెత్తాయి. ట్రూడో చేసిన ఆరోపణలను భారత్ ఖండించింది. ఆధారాల్లేకుండా నిందలు వేయడం తగదని గట్టిగా హెచ్చరించింది. హత్యకు సంబంధించి ఆధారాలు సమర్పిస్తే పరిశీలించి దర్యాప్తునకు సహకరించే అంశంపై నిర్ణయం తీసుకుంటామని భారత్ స్పష్టం చేసింది.

ఎన్నికల విధుల్లోని ఉద్యోగులకు

ఒకరోజు ప్రత్యేక సాధారణ సెలవు

సీఈవో ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఒకరోజు ప్రత్యేక సాధారణ సెలవును మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు జీఓ ఆర్టి నంబర్ 845ను విడుదల చేశారు. ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వీలుగా ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల అభ్యర్థన మేరకు సంబంధిత అధికారులు ఒకరోజు ప్రత్యేక క్యాజువల్ సెలవును మంజూరు చేయాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సెక్రటేరియట్ విభాగాలు/విభాగాల అధిపతి/జిల్లా కలెక్టర్లు, ఇతర సంబంధిత అధికారులు తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వులలో కోరారు.

ఆర్మీ కాన్వాయ్‌పై ఉగ్రవాదుల దాడి

ఐదుగురు జవాన్లకు గాయాలు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. పూంచ్ జిల్లాలోని శశిధర్ ప్రాంతంలో భద్రతా బలగాలకు చెందిన కాన్వాయ్‌పై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు.

భారత వాయుసేన (ఐఏఎఫ్)కు చెందిన వాహనంతోపాటు మరో దానిపైనా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో అయిదుగురు జవాన్లు గాయపడినట్లు అధికారులు చెప్పారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, వారిని ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. ఈమేరకు సమాచారం అందుకున్న వెంటనే అదనపు బలగాలను ఘటనా స్థలానికి తరలించారు. ఉగ్రవాదులను గుర్తించేందుకు భారీ ఆపరేషన్ ప్రారంభించినట్లు వెల్లడించారు. గత ఏడాది సైన్యంపై వరుస ఉగ్రదాడులు జరిగిన ఈ ప్రాంతంలో ఈ ఏడాదిలో ఇదే మొదటి అతిపెద్ద దాడి అని తెలిపారు.

అఫ్గాన్ దౌత్యవేత్తపై బంగారం స్మగ్లింగ్ కేసు

ముంబై: దుబాయ్ నుంచి భారత్‌కు 18.6 కోట్ల విలువైన 25 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించేందుకు యత్నించిన అఫ్గాన్ దౌత్యవేత్త జకియా వార్దక్‌ను గత నెల 25న డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ముంబై విమానాశ్రయంలో కస్టడీలోకి తీసుకుంది. వార్దక్ బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు విమానాశ్రయంలో సిబ్బందిని మోహరించారు. ఆమె సాయంత్రం 5.45 గంటల సమయంలో తన కొడుకుతో కలిసి ఎమిరేట్స్ విమానంలో దుబాయ్ నుంచి ముంబైకి చేరుకున్నారు. కస్టమ్స్‌కు ప్రకటించాల్సిన సామాన్లను తాము తీసుకువెళ్లట్లేదని పేర్కొంటూ వారు గ్రీన్ ఛానల్‌ను ఉపయోగించారు. అనంతరం తనిఖీలు నిర్వహిస్తుండగా ఆమె దుస్తుల్లో దాచిన బంగారు కడ్డీలు బయటపడ్డాయి. వార్దక్ కుమారుడిని సైతం తనిఖీ చేశారు. అఫ్గాన్ దౌత్యవేత్త తీసుకెళ్తున్న బంగారానికి సంబంధించిన పత్రాలను సమర్పించమని అధికారులు కోరారు. ఆమె ఎటువంటి పత్రాలను సమర్పించకపోవడంతో వారు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేశారు. అత్యున్నత పదవిలో ఉన్నందున అధికారులు జకియా వార్దక్‌ను అరెస్టు చేయలేదు.

స్నానాలగదిలో విద్యార్థిని ప్రసవం



తిరువనంతపురం: కేరళలోని కొచ్చిన్‌లో ఓ యువతి (24) తాను జన్మనిచ్చిన శిశువును రోడ్డుపైకి విసిరేసింది. ఎంబీఏ విద్యార్థిని అపార్ట్‌మెంట్ బాత్‌రూమ్‌లో శుక్రవారం ఉదయం శిశువుకు జన్మనిచ్చింది. ఆ విషయం ఆమె తల్లిదండ్రులకు తెలియకూడదని అమెజాన్ పార్సిల్ కవర్‌లో శిశువును చుట్టి అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి బయటకు విసిరేసింది. ఈ క్రమంలో రోడ్డుపై పడిన శిశువు ప్రాణాలు కోల్పోయింది. కాగా, కొందరు కార్మికులు పార్సిల్ కవర్‌లో ఉన్న శిశువు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పార్సిల్ కవర్‌పై ఉన్న అడ్రస్‌ను బట్టి పోలీసులు నిందితురాలిని గుర్తించారు. ఈ ఘటనపై ఆమెను విచారిస్తున్నారు.

మల విసర్జనకు వెళ్లిన దళిత బాలిక సజీవ దహనం

లక్నో: మల విసర్జన కోసం బయటకు వెళ్లిన దళిత బాలికకు నిప్పంటించారు. దీంతో ఆ బాలిక సజీవ దహనమైంది. ఉత్తరప్రదేశ్‌లోని బలరామ్‌పూర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. హరయా పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామానికి చెందిన 13 ఏళ్ల దళిత బాలిక సాయంత్రం వేళ మల విసర్జన కోసం సమీపంలోని పొలాల వద్దకు వెళ్లింది. అయితే గంట వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. బాలిక కోసం వెతకగా పొలాల్లో ఆమెకు నిప్పు పెట్టడంతో సజీవ దహనం కావడాన్ని చూసినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలిన బాలిక మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

హెచ్‌డీ రేవణ్ణ అరెస్టు

బెంగళూరు: సార్వత్రిక ఎన్నికల వేళ కర్నాటకలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మహిళ అపహరణ కేసులో రాష్ట్ర మాజీ మంత్రి, జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అదుపులోకి తీసుకుంది. పద్మనాభ నగర్‌లోని మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ నివాసంలో రేవణ్ణను సిట్ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. రేవణ్ణకు ముందస్తు బెయిల్ మంజూరుచేసేందుకు ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నిరాకరించడంతో ఐదారుగురు సిట్ అధికారులు దేవెగౌడ నివాసానికి వెళ్లి రేవణ్ణను అదుపులోకి తీసుకున్నారు.

ఓ మహిళ కిడ్నాప్ వ్యవహారంలో రేవణ్ణ అరెస్ట్ చోటుచేసుకుంది. గతంలో రేవణ్ణ ఇంట్లో పనిచేసిన తన తల్లి కిడ్నాప్‌కు గురైందని బాధితురాలి కుమారుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

Format C-1
(for candidate to publish in Newspapers, TV)

Declaration about Criminal Cases:

Name and address of candidate : **PULLARAO PRATHIPATI**, S/o. SUBBA RAO, Door No.4-286, 2nd LINE, PANDARIPURAM, CHILAKALURIPET - 522616,PALNADU DISTRICT.

Name of political party : **TELUGU DESAM PARTY**

Name of Election : **MEMBER OF LEGISLATIVE ASSEMBLY OF ANDHRA PRADESH STATE**

Name of Constituency : **96-CHILAKALURIPET**

I **PULLARAO PRATHIPATI** (name of candidate), a candidate for the Above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

SL. No	Name of Court	Case No. and Dated	status of case(s)	Section(s) of Acts concernedand brief description of offence(s)
1)	Addl. Junior. Civil Judge Chilak-aluripet	FIR No: 238/2023 of Chilakaluripet Town Police Station, Chilakaluripet -522616.	Crime Stage	u/s.341, 353, 120-B, 144, 148 r/w.149 of IPC u/s.129 and 149 of Cr.P.C. Punishment for wrongful restraint, Assault or criminal force to deter public servant from discharge of his duty, Punishunent of criminal conspiracy, Joining unlawful assembly armed with deadly weapon, Rioting, armed with deadly weapon, Every member of unlawful assembly guilty of offence committed in prosecution of common object.
2)	Addl. Junior. Civil Judge Chilak-aluripet	FIR No: 240/2023 of Chilakaluripet Town Police Station, Chilakaluripet -522616.	Crime Stage	u/s.435, 353, 120-B r/w.149 of IPC Mischief by fire or explosive substance with intent to cause damage to amount of one hundred or (in case of agricultural produce) ten rupees, Assault or criminal force to deter public servant from discharge of his duty, Punishment of criminal conspiracy and Every member of unlawful assembly guilty of offence committed in prosecution of common object.
3)	Addl. Junior. Civil Judge Chilak-aluripet	FIR No: 125/2023 of Edlapadu Police Station, Edlapadu	Crime Stage	u/s.353, 341, 147, 143, 120-B r/w.149 of IPC Assault or criminal force to deter public servant from discharge of his duty, Punishment for wrongful restraint, Punishment for rioting, Punishment for either unlawful assembly or member of unlawful assembly, Punishment of criminal conspiracy and Every member of unlawful assembly guilty of offence committed in prosecution of common object.
4)	Addl. Junior. Civil Judge Manga-lagiri	FIR No: 93/2023 of Amaravathi Police Station, Amaravathi, Guntur Dist.	Crime Stage	u/s.143, 341, 290 r/w.149 of IPC Punishment for either unlawful assembly or member of unlawful assembly, Punishment for wrongful restraint, Punishment for public nuisance in cases not otherwise provided for and Every member of unlawful assembly guilty of offence committed in prosecution of common object.
5)	II Addl. Dist. & Session s Court, Banga-luru	FIR No: 197/2023 of Attibele Police Station, Attibele.	Crime Stage	u/s.3(2) (v-a), 3(1) (r) (s) of SC and ST Act. u/s.506, 504, 143, 149, 323, 114 of I.P.C. Commits any offence specified in the schedule, against a person or property, knowing that such person is a member of a scheduled caste or a scheduled tribe or such property belongs to such member, shall be punishable with such punishment as specified under the Indian Penal Code for such offences and shall also be liable to fine, Intentionally insults or intimidates with intent to humiliate a member of a Scheduled Caste or a Scheduled Tribe in any place within public view, abuses any member of a Scheduled caste or a scheduled Tribe by caste name in any place within public view, Punishment for criminal intimidation, Intentional insult with intent to provoke breach of the peace, Punishment for either unlawful assembly or member of unlawful assembly, Every member of unlawful assembly guilty of offence committed in prosecution of common object, Punishment for voluntarily causing hurt and Abettor present when offence is committed
6)	II Addl. Junior Civil Judge, Bhima-varam	FIR No: 277/2022 of Undi Police Station, Undi Village & Md, Godavari Dt.	Crime Stage	u/s.188, 341, 143 r/w.149 of IPC Disobedience to order duly promulgated by public servant, Punishment for wrongful restraint, Punish -ment for either unlawful assembly or member of unlawful assembly and Every member of unlawful assembly guilty of offence committed in prosecution of common object.
7)	II Addl. Junior Civil Judge, Bhima-varam	FIR No: 276/2022 of Undi Police Station, Undi Village & Md, Godavari Dt.	Crime Stage	u/s.188, 341, 353, 332, 143, 144, 147, 148 r/w.149 of IPC 32 PA-1861Disobedience to order duly promulgated by public servant, Punishment for wrongful restraint, Assault or criminal force to deter public servant from discharge of his duty, Voluntarily causing hurt to deter public servant from his duty, Punishment for either unlawful assembly or member of unlawful assembly, Joining unlawful assembly armed with deadly weapon Punishment for rioting, Rioting, armed with deadly weapon, Every member of unlawful assembly guilty of offence committed in prosecution of common object andPenality for disobeying orders issued under last three sections, etc.
8)	II Addl. Junior Civil Judge, Chilaka-luripet	FIR No: 136/2022 of Chilakaluripet Town Police Station, Chilakaluripet -522616.	Crime Stage	u/s.353, 509, 506, 323 r/w.34 of IPC 3(1)(r), 3(1)(s), 3(2) (va) SC ST POA Act Assault or criminal force to deter public servant from discharge of his duty, Word, gesture or act intended to insult the modesty of a woman, Punishment for criminal intimidation, Punishment for voluntarily causing hurt, acts done by several persons in furtherance of common intention and Intentionally insults or intimidates with intent to humiliate a member of a Scheduled Caste or a Scheduled Tribe in any place within public view and abuses any member of a Scheduled caste or a scheduled Tribe by caste name in any place within public view and commits any offence specified in the schedule, against a person or property, knowing that such person is a member of a scheduled caste or a scheduled tribe or such property belongs to such member, shall be punishable with such punishment as specified under the Indian Penal Code for such offences and shall also be liable to fine.
9)	Prl. Judicail First Class Magistr-ate, Medak.	FIR No: 167/2022 of Monohara-bad Police St. Manoharabad Vil & Md, Medak Dt. Telangana State.	Crime Stage	u/s.471, 420, 506 r/w.34 I.P.C. Whoever fraudulently or dishonestly uses as genuine any which he knows or has reason to believe to be a forged, Cheating and dishonestly inducing delivery of property and Punishment for criminal intimidation.
10)	Addl. Junior Civil Judge, Gurazal	FIR No: 261/2022 of Dachepalli Police Station, Palnadu Dt.	Crime Stage	u/s.151 of CR P C Arrest to prevent the commission of cognizable offences
11)	Addl. Junior Civil Judge, Guntur.	FIR No: 448/2021 of Old Guntur Police Station, Old Guntur.	Crime Stage	u/s.341, 353, 147, 120-B r/w.149 of IPC Punishment for wrongful restraint, Assault or criminal force to deter public servant from discharge of his duty, Punishment for rioting, conspiracy and criminal Every member of unlawful assembly guilty of offence committed prosecution of common object.
12)	Addl. Jr.Civil Judge, Chilaka-lurpet	FIR No: 45/ 2020 of Chilakalurpet town police station, chila-kalurpet.C.C. No. 44/2024, Dt.30-1-2024	Summons Stage	u/s.341, 188 r/w.34 of IPC Punishment for wrongful restraint, Disobedience to order duly promulgated by public servant and acts don by several persons in furtherance of common intention.
13)	CID Court, Guntur.	FIR No: 12/ 2019 of A.P CID Police Station, Amaravathi.	Crime Stage	u/s.420, 506 r/w.120-B, & u/s.3(1)(g) & (p) of SC and ST (POA) Amendment Act 2015 Cheating and dishonestly inducing delivery of property, Punishment for criminal intimidation, Punishment of criminal conspiracy, Wrongfully dispossesses of a Schedule Caste or a Schedule Tribe and Institutes, malicious or vexatious suitor criminal or other legal proceedings against a member of a Schedule Caste or a Scheduled Tribe.

(B) Details about cases of Conviction for criminal offences.

SL. No	Name of Court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	**Maximum Punishment Imposed**
	Not Applicable	Not Applicable	Not Applicable

Sd/- PULLARAO PRATHIPATI
96-CHILAKALURIPET Legislative Assembly of Andhra Pradesh State

ఉద్యోగులను మభ్యపెట్టేందుకు చంద్రబాబు లేఖలు: గౌతమ్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగులను మభ్యపెట్టేందుకే టీడీపీ అధినేత చంద్రబాబు లేఖలు రాస్తున్నారని వైసీపీ ట్రేడ్ యూనియన్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అధికారంలో ఉండగా ఉద్యోగులను వేధించుకుతిన్న చంద్రబాబు ఉద్యోగులకు లేఖలు రాయడం హాస్యాస్పదమని అన్నారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాత ప్రభుత్వమని, అధికారంలోకి రాగానే 27 శాతం తాత్కాలిక ఉపశమనం ఇచ్చిన విషయాన్ని చంద్రబాబు మరిచారా అని ప్రశ్నించారు. ఇందుకోసం రూ.17,918 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. నాడు చంద్రబాబు ఎగ్గొట్టిన డీఏలను జగన్ ఇచ్చారని గుర్తుచేశారు. పారిశుధ్యకార్మికులు, చిన్న ఉద్యోగులకు నవరత్నాల అమలుకు నిర్ణయించారని, ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని పెంచారని, వారు అడగకుండానే ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు జగన్ పెంచారని చెప్పారు.

ల్యాండ్ టైటిలింగ్‌పై బాబు దుష్ప్రచారం: పోతుల సునీత

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత ధ్వజమెత్తారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించరంటూ నిలదీశారు. అసత్య ఆరోపణలు చేసి ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టాలని చూస్తున్నా రని, భూ యాజమానుల అభిప్రాయం తీసుకునే రీ సర్వేలు చేస్తున్నారని చెప్పారు. అసైన్డ్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి దళితుల భూములను కాజేసిన చరిత్ర తెలుగుదేశం నేతలదేనని ఆమె విమర్శించారు.

బీజేపీకి ఎదురు గాలి

- అందుకే మతాల మధ్య మోదీ చిచ్చు
- మైనారిటీల ఆత్మీయ సమావేశంలో అజీజ్ పాషా

విశాలాంధ్ర-గుంటూరు: దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన రెండు విడతల ఎన్నికల పోలింగ్ సరళితో ఓటమి తప్పదనే భయం మోదీ ప్రభుత్వానికి పట్టుకుందని, ఈ నేపథ్యంలో హిందూ, ముస్లిం అంటూ మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందడానికి మోదీ కుట్ర చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా అన్నారు. ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఇన్సాఫ్, అవాజ్ ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో శనివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఇస్టా జాతీయ కార్యదర్శి గని అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన అజీజ్ పాషా మాట్లాడుతూ మీడియాను చెప్పుచేతల్లో పెట్టుకున్న మోదీ ప్రభుత్వం ఈసారి ఎన్నికల్లో 400 సీట్లు పైగా తాము గెలుస్తామని గొప్పలు చెప్పుకుంటుందని, కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్న విషయం ప్రజలందరికీ తెలిసిపోయిందన్నారు. మోదీ ఎన్నికల ప్రచారంలో ఎక్కడా కూడా దేశ ఆర్థిక విధానాలు, నిరుద్యోగం వంటి అంశాలపై మాట్లాడ టంలేదని, కేవలం మతాల మధ్య చిచ్చు పెట్టడానికే ఆయన వ్యాఖ్యలు పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగ ఉద్యమ ప్రభావం పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌పై ఉందని, ఇద్దరు సీఎంల అరెస్టు ప్రభావం ఢిల్లీ, జార్ఖండ్‌లలో ఉందని...అక్కడ ఆయా పార్టీలకు సానుభూతి పవనాలు వీస్తున్నాయని చెప్పారు. గతంలో క్లీన్ స్వీప్ చేసిన రాష్ట్రాలలో కూడా ఈసారి మోదీ ప్రభు త్వానికి సగం సీట్లు కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ గుర్తు కంకి కొడవలిపై ఓట్లు వేసి గెలిపించాలని ముస్లిం సోదరులకు విజ్ఞప్తి చేశారు. అవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి మాట్లాడుతూ ప్రస్తు తం దేశంలో జరుగుతున్న ఎన్నికలు ఫాసిస్టు మనువాద భావజాలానికి వామపక్ష భావజాలానికి మధ్య జరుగుతున్న పోరుగా అభివర్ణించారు. దేశ ప్రధానిగా మోదీ ఎన్నికల ప్రచారంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదని అన్నారు. గత పదేళ్ల కాలంలో దేశంలో చోటుచేసుకున్న మారణహోమాల కారణంగా తెగిపోయిన మంగళసూత్రాలు మోదీకి కనబడకపోవడం శోచనీయమ న్నారు. ఇది కేవలం ముస్లింల సమస్య కాదని, అన్ని వర్గాల సమస్య అన్నారు. రాష్ట్రంలోని వైసీపీ, టీడీపీలు సైతం మోదీకి తొత్తులుగా మారిపోయారని దుయ్యబట్టారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవా లంటే ఇండియా కూటమి గెలుపు ఒక్కటే మార్గమని, ఈ విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మైనారిటీల హక్కుల కోసం నిలబడే గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాలకు, మంగళగిరిలో సీపీఎం అభ్యర్థికి, మిగిలిన ప్రాంతాలలో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ తరుపున గుంటూరు పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ ఒక్కసారైనా తన ఓటు హక్కును వినియోగించుకున్నారా అని ప్రశ్నించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని తాము సమర్థిస్తున్నామని పెమ్మసాని ప్రకటన చేయగలరా? రాష్ట్రానికి అమరావతే ఏకైక రాజధాని అంటూ వైసీపీ ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య చెప్పగలరా అంటూ నిలదీశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై వీరిరువురు పోరాటం చేయగలరా అని ప్రశ్నించారు. కేవలం ధన బలంతో ఎన్నికలలో గెలవాలను కోవడం ఒక భ్రమ మాత్రమేనన్నారు. ఎన్నికలలో ధన బలం ఉన్న తిమింగిలాలను తరిమికొట్టి, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(శరద్ పవార్ గ్రూప్) మైనారిటీ విభాగం జాతీయ ఉపాధ్యక్షులు జమీల్ అహ్మద్ బేగ్, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రసంగించారు. తొలుత ఎస్‌కే వలి అతిథులకు స్వాగతం పలికారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ నాయకులు షేక్ అమీర్ వలి తదితరులు పాల్గొన్నారు.

బాబు బానిస కూలీగా పవన్: అడపా శేషు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు బానిస కూలీగా పవన్ కల్యాణ్ మారిపోయాడని వైసీపీ నాయకుడు అడపా శేషు ఎద్దేవా చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల క్షేత్రంలో రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు పరస్పర ఆరోపణలు చేసుకోవడం సహజమేనని, చంద్రబాబు, పవన్ తీరు మాత్రం అత్యంత జుగుప్సాకరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరాధ్యదైవమైన ముఖ్యమంత్రిని ఎలా సంభోదించాలో తెలియని అజ్ఞానుల్లా వారి మాటతీరు ఉందని, వారిద్దరూ జగన్ నుంచి సంస్కారం నేర్చుకోవాల్సిందేనని సూచించారు. ప్రజలతో మమేకమవుతూ వారి కష్టాల్ని తెలుసుకుంటూ, అక్కడికక్కడ పరిష్కారాలను చూపుతూ, ఐదేళ్ల పరిపాలనను వారికి వివరించుకుంటూ జగన్ ఎన్నికల జైత్రయాత్ర చేస్తున్నారని వివరించారు. చంద్రబాబు, పవన్ ఎలా చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు.

మన ఆస్తుల పరిరక్షణకు కూటమిని గెలిపించండి: పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-గుడివాడ: మన ఆస్తులపై జగన్ పెత్తనంతో పాటు ఆస్తులను కూడా కబ్జాలు చేయడం కోసం ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తీసుకువచ్చారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం గుడివాడలో పవన్ రోడ్ షో, స్థానిక నెహ్రూ చౌక్‌లో బహిరంగ సభ నిర్వహించారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ దశాబ్ద కాలం నుంచి ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని నేడు నిలబడ్డామ న్నారు. రోడ్లపై ఉన్న గోతులు గురించి అడిగితే బూతులు తిట్టడం వైసీపీ ఎమ్మెల్యేల వంతయిందన్నారు. బూతులు తిట్టే వైసీపీ నాయకులకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. 2019లో ఓటు వేస్తే మద్యం తీసి వేస్తామని హామీ ఇచ్చి, మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. సీపీఎస్‌ను రద్దు చేస్తానని, రైతులకు సాగు నీరు ఇస్తానని మోసం చేశార న్నారు. రాష్ట్రంలో 7 వేలకు పైగా ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను మూసివేశారని తెలిపారు. కాల్వలలో పూడిక తీయకపోవడంతో సాగు చేయలేని పరిస్థితి వచ్చిందని, వరి సాగు తగ్గిపోయిందన్నారు. కొడాలి నాని ఓడిపోయిన తరువాత పండుగ చేసుకుందామని తెలిపారు. అసెంబ్లీలో గుడివాడ సమస్యలపై గళం వినిపిస్తామన్నారు. పోలవరం పూర్తి చేస్తామని, యువతకు ఉపాధి కల్పించి, పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ అవకాశాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఆక్వా రంగానికి పెద్ద పీట వేస్తామన్నారు. జగన్ ప్రభుత్వం రూ.1,200 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పడిందన్నారు. ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరు తీసేశారని ఆరోపించారు. మోటూరు గ్రామంలో రాత్రి సమయంలో మట్టి దోచుకుంటున్నారని అన్నారు. వైసీపీ ప్రతి ఒక్కరిపై దాడులు చేస్తుంటే ఎలా అని ప్రశ్నించారు. ఇంకా తొమ్మిది రోజులే సమయం ఉందని అన్నారు. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే అభ్యర్థి వెనిగండ్ల రాము గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ కొనకొళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుత్తికొండ సారధి, బూరగడ్డ శ్రీకాంత్, పాలంకి సారధి, మజ్జి శ్రీనివాస్, కొదమాల గంగాధర్, పేర్ని జగన్, వేమూరి త్రినాథ్, సాయిన రాజేష్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ బాధ్యత ఎన్నికల కమిషన్‌దే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగీ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు శనివారం ఓ ప్రకటనలో తెలి పారు. నియోజకవర్గాల వారీగా ఎంతమంది సిబ్బందిని ఎన్నికల విధులకు కేస్తాయించారో, ఎంతమందికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వబోతున్నారో ఇప్పటికీ స్పష్టమైన సమాచారం లేదన్నారు. ఇటీవల కొత్తగా ఎన్నికల విధులకు కేటాయిం చబడిన ప్రతి అంగన్‌వాడీ, కాంట్రాక్టు ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగిం చుకునేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వాములవుతున్న ఉద్యోగులందరికీ పోస్టల్ పోస్టల్ బ్యాలెట్ వేసుకొనే సౌకర్యాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కల్పించాలని కోరారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఏ ఒక్క ఉద్యోగీ తమ ఓటును వినియోగించు కోలేక పోయామనే భావన ఎక్కడా రాకుండా చూడాలని కోరారు.

జగన్ పాలనలో పింఛన్‌దారుల ఇక్కట్లు: వర్ల రామయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ పాలనలో పింఛన్‌దారుల బాధలు వర్ణనాతీతమని, కుంటిసాకులు, జగన్నాటకాలతో సీఎం, సీఎస్ జవహర్‌రెడ్డి పింఛన్‌దారుల ప్రాణాలు తీస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ధ్వజమెత్తారు. టీడీపీ మంగళగిరి జాతీయ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ రాజకీయ కక్ష వల్లే పింఛన్‌దారులు ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్యలను సృష్టించి ఆ నెపాన్ని చంద్రబాబుపై నెడుతున్నారని మండిపడ్డారు. తాను చేసిన తప్పును ఎదుటి మనిషిపైకి నెట్టడంలో జగన్ దిట్ట అని అన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారుడు జీవరత్నం మృతి

ప్రముఖుల నివాళి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారుడు, సీపీఐ నేత బొంతా జీవరత్నం (68) శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. గుంటూరులో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శిగా పనిచేసిన జీవరత్నం నిబద్ధత గల నాయకుడిగా వ్యవహరించారు. సాంస్కృతిక రంగంలో నటుడుగా, నాట్య దర్శకుడిగా, దర్శకుడిగా వ్యవహరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వేలాది మంది ప్రజా నాట్యమండలి కళాకారులకు జీవరత్నం శిక్షణ ఇచ్చారు. ఊరమ్మటి బతుకులు, భూ భాగోతం, పల్లెసద్దెలు తదితర నాటకాల్లో నటించి మెప్పించారు. గతంలో అక్షరదీప్తి కార్యక్రమం ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన చిలకలూరిపేట మండలం వేలూరుకు తీసుకొచ్చారు. అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జీవరత్నం తన కళ్లను మరణానంతరం ఆసుపత్రికి నేత్రదానం చేశారు.

కళారూపాలతో ప్రజల్లో చైతన్యం: ముప్పాళ్ల

జీవరత్నం మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ప్రజా నాట్యమండలి కళకారుడుగా ఆయన పాటలు, కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని, మూఢనమ్మకాలు, మద్యం తాగడం వంటి దురాచారాలపై పోరాటం చేశారని గుర్తుచేశారు. జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి ప్రజా సంస్కృతికి పట్టం కట్టారని అన్నారు. సామాజిక మార్పు కోసం తపనపడ్డారని, నమ్మిన ఆదర్శాలను ఆచరించిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి నాగబైరు

రామసుబ్బాయమ్మ, ఆర్.వెంకటేశ్వరరావు(ఆర్వీ), పేలూరి రామారావు, తాళ్లూరి బాబురావు, కందిమళ్ల వెంకటేశ్వర్లు, నాయుడు శివ, సృజన్, భారతి, గాత్రం భగత్ సింగ్, ఖాదర్‌వలి, చౌటుపల్లి నాగేశ్వరరావు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

విశాలాంధ్ర

సంపాదకీయం

రాయ్‌బరేలీపై నిరర్ధక రచ్చ

రాహుల్ గాంధీని ఉత్తరప్రదేశ్ లోనిఅమేథీ నుంచి పోటీ చేయించాలని బీజేపీ చాలా ప్రయత్నం చేసింది. ఒక వేళ 2019లో లాగా రాహుల్ గాంధీ అమేథీ నుంచి మళ్లీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోతే ఆనందించవచ్చునని అత్యాశకు పోయింది. 2019 ఎన్నికలలో రాహుల్ తన కుటుంబానికి కంచుకోట లాంటి అమేథీ నుంచే కాక వాయనాడ్ నుంచి కూడా పోటీచేసి వాయనాడ్ లో గెలిచి అమేథీలో స్మృతి ఇరానీ చేతిలో 55,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇది బీజేపీకి అత్యంత అనుకూలమైన అంశం. కానీ చివరి నిముషం దాకా అమేథీ నుంచి రాహుల్ పోటీ చేస్తారా లేదా అన్న ఊహాగానాలకు కావలసినంత అవకాశం ఇచ్చి చివరకు రాయ్ బరేలీ నుంచి పోటీ చేయాలని రాహుల్ నిర్ణయించుకున్నారు. ఇందిరా గాంధీ హయాం నుంచి ఈ రెండు లోకసభ నియోజకవర్గాలు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తూ వచ్చాయి. ఇందిరా గాంధీ రాయబరేలీకే ప్రాతినిధ్యం వహించేవారు. 1977 ఎన్నికలలో మాత్రం ఆమె సోషలిస్టు పార్టీ నాయకుడు రాజ్ నారాయణ్ చేతిలో ఓడి పోయారు. 1967, 1971లో ఇందిరా గాంధీ రాయ్ బరేలీకే ప్రాతినిధ్యం వహించారు. 1977లో ఓడిపోయినా 1980లో మళ్లీ అక్కడినుంచే గెలిచారు. 1984, 1996లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులుగా అరుణ్ నెహ్రూ, షీలా దీక్షిత్ విజయం సాధించారు. 2004, 2009లో సోనియా గాధీ గెలిచింది ఇక్కడే. ఇందిరా గాంధీ భర్త ఫెరోజ్ గాంధీ 1952, 1957లో రాయ్ బరేలీ నుంచే లోకసభకు ప్రాతినిధ్యం వహించారు. రాహుల్ గాంధీ రెండో నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేయాలని నిర్ణయించుకున్నప్పుడు అమేథీని కాకుండా రాయబరేలీని ఎంపిక చేసుకోవడం వెనక బలమైన రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. నిజానికి కాంగ్రెస్ కార్యకర్తలు రాహుల్ అమేథీ నుంచి పోటీచేస్తే కాంగ్రెస్ పరిస్థితి మరింత మెరుగవుతుందని ఆశించారు. రాహుల్ అమేథీ నుంచి పోటీ చేయడం స్మృతి ఇరానీతో తలపడడం కాదని అది నేరుగా మోదీని ఎదుర్కోవడానికి ఉపకరిస్తుందని వారి భావన. ఇటీవలి కాలంలో మోదీ అనుమానాలకు తావు లేకుండా రాహుల్ నే తన అసలు ప్రత్యర్థిగా భావిస్తున్నారు. అయితే అమేథీ నుంచి కాంగ్రెస్ రంగంలోకి దింపిన కిశోరీలాల్ శర్మ కాంగ్రెస్ అగ్రనాయకులకు అత్యంత సన్నిహితుడు. అమేథీలో సోనియా గాంధీ కుటుంబం తరఫున ఆ నియోజక వర్గ బాధ్యతలను ఆయనే చూసుకున్నారు. దాదాపు 40 ఏళ్ల నుంచి అదే పని చేస్తున్నారు. నిఖార్సైన కాంగ్రెస్ కార్యకర్తగా ఆయనకు అమేథీ నుంచి పోటీచేసే అవకాశం ఇవ్వడం సబబే. అయితే అమేథీలో గత కొంత కాలంగా భారీ మార్పులు వచ్చాయి. అయినా అమేథీ నియోజక వర్గం గురించి కిశోరీ లాల్ శర్మకు అణవణువూ తెలుసు. ఆయన స్థానికుడు కావడం కూడా మరో సానుకూల అంశం. రాహుల్ రాయబరేలి నుంచి పోటీ చేయడం అక్కడ తమకు ఇంతవరకు ఉన్న పట్టును పదిలపరచుకోవచ్చునన్న ఆలోచన కూడా కాంగ్రెస్ కు ఉండి ఉండవచ్చు.

కాంగ్రెస్ ది వంశపారంపర్య పాలన అని అనునిత్యం దెప్పి పొడిచే బీజేపీ చివరకు భంగ పడవలసి వచ్చింది. ప్రియాంకా గాంధీ ఎన్నికలలో పోటీ చేయను అని ప్రకటించడం బీజేపీ కుటిల ఊహలకు అవకాశం లేకుండా పోయింది. ఈ సారి ఎన్నికలలో ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీలో ఒకరే పోటీ చేయాలన్న సంకల్పం ముందు ఉంది. ముందునుంచే ఈ ఎన్నికలలో రాబర్ట్ వాద్రా కూడా రంగంలో దిగడానికి సిద్ధమయ్యారు. ప్రియాంకా గాంధీ విపరీతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆమె కనీసం రెండు మూడు సభలలో పాల్గొంటున్నారు. రాహుల్, ప్రియాంక ఇద్దరూ పోటీచేసి ఉంటే అవి తమ గౌరవానికి సంబంధించినవి కనక వాటిలో విజయం ప్రతిష్ఠకు సంబంధించిన అంశం అవుతుంది. కనక ఇద్దరిలో ఒకరే పోటీ చేయాలనుకున్నారు. లేకపోతే ఆ ఇద్దరూ తమ నియోజక వర్గాలలో గెలుపు మీదే ఎక్కువ శ్రద్ధ పెట్టవలసి వచ్చేది. మిగతా చోట్ల ప్రచారానికి అట్టే సమయం కేటాయించే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు ప్రియాంక సైతం వివిధ నియోజక వర్గాలలో ప్రచార బాధ్యత తీసుకోవచ్చు. రాహుల్ గాంధీ సైతం రాయ్ బరేలీకి మూడు నాలుగు సార్లయినా వెళ్లక తప్పక పోవచ్చు. రాయ్‌బరేలీ, అమేథీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరో చెప్పకుండా కాంగ్రెస్ జాప్యం చేయడం వెనక ఇదే వ్యూహం ప్రధానమైంది. సోనియా ఇటీవలే రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. సోనియా ప్రత్యక్ష ఎన్నికలలో పాల్గొనకుండా రాజ్యసభకు వెళ్లడం కూడా బీజేపీకి అభ్యంతరకరమైంది. రాహుల్ చివరిదాకా ఎక్కడి నుంచి పోటీ చేస్తారో చెప్పకపోవడం, సోనియా రాజ్యసభకు వెళ్లడాన్ని కూడా పెద్ద ప్రచారాస్త్రం చేశారు. మళ్లీ ఈ సారి గెలవలేనన్న భయంతో సోనియా రాజ్యసభను ఆశ్రయించారని దుమారం రేపారు. ఇప్పుడు రాహుల్ రాయ్ బరేలీ నుంచి పోటీ చేయడం కూడా బీజేపీకి అభ్యంతరకరం అయింది. ఆయన రెండు చోట్ల నుంచి పోటీ చేయడాన్ని కూడా బీజేపీ తప్పుపడ్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ నుంచే కాక వారణాసి నుంచి ఎందుకు పోటీ చేశారు అన్న ప్రశ్నకు మాత్రం వారి దగ్గర సమాధానం లేదు. ఎక్కడ ఎవరు పోటీచేసినా, కొంతమంది రెండేసి సీట్ల నుంచి పోటీ చేసినా విజయం ఎవరిని వరిస్తుంది అన్నది జూన్ నాలుగున గానీ తేలదు. ఇంతకు ముందు రాహుల్ గాంధీని రోజూ అవహేళన చేసేవారు. రాహుల్ రాజకీయాల్లో రాటు దేలడం మోదీ గుండెల్లో భయం పెరుగుతోంది. క్రమంగా రాహుల్ తనకు బలమైన రాజకీయ ప్రత్యర్థిగా ఎదగడం మోదీకి ఇబ్బందికరంగా తయారైంది. అందుకే రాహుల్ ఎక్కడి నుంచి పోటీ చేస్తున్నారు అన్న అంశాన్ని కూడా సంకుచిత రాజకీయ రచ్చ కింద మారుస్తున్నారు. కాంగ్రెస్‌ను నిరంతరం ఆదరిస్తూ వచ్చిన రాయ్ బరేలీని కాపాడుకోవడం, అమేథీలో 2019లో రాహుల్ ఓడి పోయింది కేవలం 55 వేల ఓట్ల తేడాతోనే. దాదాపు ఇరవై లక్ష ఓటర్లున్న చోట ఈ లోటు భర్తీ చేయడానికి వీలులేనిది ఏమీ కాదు. బీజేపీ గుర్తించ వలసింది ఇది వ్యక్తుల మధ్యో, ఉభయ పక్షాల నేతల మధ్యో పోటీ కాదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని రక్షించడానికి ప్రతిపక్షాలన్నీ దీక్షా బద్ధమై ప్రయత్నిస్తున్న ఎన్నికలు ఇవి. ఇప్పుడు మోదీని ఓడించకపోతే భవిష్యత్తులో ఎన్నికలే ఉండబోవేమోనన్న భయాందోళనలు

మోదీ టోపీలో ముగ్గురు సామంతులు

సవ్యసాచి

ఏపీలో మేనిఫెస్టోల యుద్ధం మొదలైంది. పార్టీల ఫ్యాక్టరీల్లో మేనిఫెస్టోలు తయారయ్యాయి. ఇవి ప్రజల మేనిఫెస్టోలు కావు. ఓట్ల కోసం పార్టీలు రూపొందించిన మేనిఫెస్టోలు. పార్టీలకు ప్రజలు ప్రభువులు కాదు. ఫక్తు ఓటర్లు మాత్రమే. అంతకుమించి లబ్ధిదారులు మాత్రమే. ఇప్పుడు రాష్ట్రంలో రెండు మేనిఫెస్టోల దుకాణాలు వున్నాయి. వాటి నిండా ప్రలోభ ఉచితాల సరుకులు వున్నాయి. ఆకర్షణీయ నినాదాలు ఉన్నాయి. ఇంటింటికి ఈ ప్రలోభ సరుకుల్ని ప్రచారం చేసే రంగు రంగుల కరపత్రాల పంపిణీ వుంది. ఓటర్లు తమకు ఏం కావాలన్నది సమస్య కాదు. పార్టీలు తమకు ఏమి ఇస్తారన్నదే ముఖ్యం. ఎవరిని ఎంచుకోవా లన్నది అంత తేలిక కాదు. ఒకరు ఒకటి ఇస్తామంటే మరొకరు రెండు అంటున్నారు. వారు పది అంటే వీరు పాతిక అంటున్నారు. ఇవి జవాబు దారీతనం లేని మేనిఫెస్టోలు. వీటికి పార్టీల అధినేతలే గ్యారంటీలు. ఎలా అమలు చేస్తారంటే మాకు అధికారం ఇవ్వండి చేసి చూపిస్తామని దబాయిస్తున్నారు. ఓటర్లు నాయకుల్ని నమ్మాలి. వారిని విశ్వసించాలి. ఈ ఓట్ల వేట మేనిఫెస్టోలలో ప్రజల విశ్వసనీయతే ఆ పార్టీలకు అసలు పరీక్ష. వైకాపా పాలనలో రాష్ట్రం ఆర్థికంగా కుదేలు అయ్యింది. 'పిట్టను కొట్టు పొయ్యిలో పెట్టు' అన్నట్టుగా 'అప్పులు పట్టు గండం దాటు' అన్న స్థితి వుంది. సచివాలయాలతో సహా అన్నీ తాకట్టు పెట్టారట. ఇప్పుడు తెదేపా కురిపిస్తున్న వరాలు ప్రజల ఇళ్లలో ఎలా వర్షిస్తాయన్నది ఊహించు కోవాల్సింది. ఈ ఓట్ల వేట వీరులలో ఎవరు గెలుస్తారో చెప్పలేం. గెలిచేది ఎవరైనా ఫలితం ఒక్కటే. రోజూ టీవీలలో గోల్డ్ కంపెనీల ప్రకటనలు విన్నారు కదా ! 'మీరు ఎక్కడైనా తాకట్టు పెట్టిన బంగారాన్ని ఒక్క క్షణంలో విడిపించి ఆ రోజు ఆన్‌లైన్ ధర

చెల్లించి మిగిలిన సొమ్ము మీ చేతిలో పెడతాం' ఇప్పుడు ఇదే రాష్ట్రానికి వర్తిస్తుంది. తాకట్టు విడిపించడం వుండదు. అమ్మగా మిగిలితే సొమ్ము చేసుకోవడం తప్ప మార్గాంతరం వుండదు. రాష్ట్రంలో నాలుగు పార్టీలు. వైకాపా, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఒక రాజకీయ నాటకం ఆడుతున్నాయి. తెలుగులో చాలా పొడుపు కథలు వున్నాయి. అవి ఎంతో ఆసక్తిని రేపుతాయి. ఊహాశక్తి వుంటే గాని విప్పడం సులువు కాదు. ఉదాహరణకు 'ఒక టోపీ కింద ముగ్గురు అన్నదమ్ములు' అన్న పొడుపు కథ వుంది. సమాధానం తాటిపండు అని ఊహించడం అంత తేలిక కాదు. కాని, మన రాష్ట్రంలో 'ఒక టోపీ కింద ముగ్గురు సామంతులు' అనే పొడుపు కథ వేస్తే దీనిని విప్పడానికి గొప్ప తెలివి అక్కరలేదు. ఇందులో తాటికాయంత రహస్యం లేదు. మోదీ టోపీ కింద చంద్రబాబు, పవన్, జగన్‌లు కళ్ల ముందు సాక్షాత్కరిస్తారు. 2019లో ఈ నలుగురు ఒకరిమీద ఒకరు పోటీ చేసుకున్నారు. కేవలం ఆరోపణలతో సరిపెట్టుకోలేదు. మాటల తూటాలు పేల్చుకున్నారు. విమర్శల కత్తులు దూసుకున్నారు. ప్రత్యేకంగా బీజేపీ మీద, మోదీ మీద విరుచుకుపడ్డారు. ఒకరు మోదీ అబద్ధాల కోరు అన్నారు. మరొకరు హోదా ఇస్తామని పాచిపోయిన ప్యాకేజీ లడ్డూ ఇచ్చారన్నారు. మరొకరు మోదీ మెడలు వంచి హోదా తెస్తామన్నారు. 2019 ఎన్నికలలో బీజేపీ రాష్ట్రంలో చిత్తుగా ఓడిపోయింది. స్వయంగా మోదీ వచ్చి ప్రచారం చేసినా ఎక్కడా డిపాజిట్లు దక్కలేదు. ఒక శాతం ఓట్లు కూడా తెచ్చుకోకపోగా నోటాకంటే తక్కువగా ప్రజలు తిరస్కరించారు. మోదీ ప్రభంజనం ఏపీలో తుస్సుమంది. ఎన్నికలు పూర్తి కాగానే ఈ నాలుగు పార్టీల పోటీ నాటకం ముగిసింది. అంతా మోదీపంచకు చేరారు. స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనా లను గాలికొదిలేశారు. పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వానికి అండగా వున్నారు. ఒక శాతం ఓట్లులేని బీజేపీకి 25 పార్లమెంటు స్థానాలను దాసోహం చేశారు. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవంటారు. కాని, మోదీ టోపీ కింద కత్తులు దూసుకున్న వారంతా ఇమిడిపోయారు. ఇప్పటికీ బీజేపీకి రాష్ట్రంలో ఉనికి లేదు. ఒంటరిగా పోటీచేస్తే నోటానే గెలుస్తుంది. కాని ముగ్గురు సామంతులు దానికి ప్రత్యక్షంగా పరోక్షంగా బాసటగా వున్నారు. పంచతంత్రంలో 'అపరీక్షతకారికత్వం' అన్నది అనాలోచనపరుల ఐదో తంత్రం. ఇందులో సింహానికి ప్రాణం పోసి దానికి బలైన ముగ్గురు తాంత్రికుల కథ వుంది. ఈ ముగ్గురూ తమకు తెలిసిన తంత్ర విద్యను రాజు దగ్గర ప్రదర్శించడానికి పోతుంటే దారిలో ఒక సింహం ఎముకలు కనిపిస్తాయి. మొదటివాడు తన తంత్ర విద్యతో ఆ ఎముకలతో సింహం అస్థిపంజరాన్ని రూపొందిస్తే, రెండోవాడు దానికి రక్త మాంసాలు జత చేస్తాడు. మూడో వాడు దానికి ఊపిరిపోస్తాడు. సింహం లేస్తుంది. జూలు విదిలిస్తుంది. ఒకరి తర్వాత మరొకరిని వెంటాడి చంపుతుంది. మోదీ టోపీ కింద చేరిన ముగ్గురు సామంతులు రాష్ట్రంలో ఈ తాంత్రికుల పనే చేస్తున్నారు. అంతా మోదీకి మద్దతుదారులమే అంటున్నారు. నామ మాత్రంగా వున్న బీజేపీకి ప్రాణం పోస్తున్నారు. ఎన్నికల తర్వాత అది జూలు విదిలిస్తుంది. ఇప్పటికే డబుల్ ఇంజన్ సర్కార్ నినాదాన్ని అందుకుంది. దీనికోసం ప్రాంతీయ పార్టీలను చీల్చడం లేదా వాటిని పడగొట్టడం కాదన్న వారిని జైళ్ళపాలు చెయ్యడమే మోదీ రాజకీయం. ప్రస్తుతానికి బీజేపీ వీరితో జట్టు కట్టినా అది ఈ పార్టీలను పొట్టన పెట్టుకుంటుంది. ఒకే దేశం, ఒకే మతం, ఒకే నేత, ఒకే పార్టీ నినాదంలో ప్రాంతీయ పార్టీలను బలిపీఠం ఎక్కిస్తుంది. ఈ సామంతుల అనాలోచిత చర్య ఆ పార్టీలకు ప్రాణగండం అవుతుంది. ప్రజలు అప్రమత్తులు కావాలి. బీజేపీ దాని సామంతుల దొంగాటను ఓడించాలి.

మార్క్స్ జన్మస్థలం ట్రైయర్ కళాసంపదకు నిలయం

బుడ్డిగ జమిందార్

ట్రైయర్ జర్మనీ పురాతన నగరం. రోమన్ చక్రవర్తి అగస్టస్ పాలనలో క్రీ.పూ.16లో స్థాపించినది. పోర్టానిగ్రా వంటి పురాతన కళాసంపదకు, స్మారక చిహ్నాలకు ముఖ్యమైన ప్రదేశం ఈ నగరం. లక్సెంబర్గ్ సరిహద్దుకు సమీపంలో సుందరమైన మోసెస్ లోయకు పైభాగన ఈ నగరం ఉన్నది. ఇక్కడ అరుదైన చరతురాస్రాకార మార్కెట్‌ను, అనేక ఉత్త రోమన్ శిధిలాలను చూడవచ్చు. క్షీణించే పశ్చిమ రోమన్ సామ్రాజ్యానికి కాన్‌స్టాంటైన్ చక్రవర్తి పశ్చిమ రోమన్ రాజధానిగా తీసుకొన్నాడు. రోమన్ చక్రవర్తుల తర్వాత బిషప్‌లు, ఎలెక్టర్లు సాధారణ ప్రజలు ట్రైయర్‌ను నిర్మించారు. చాలా చిహ్నాలు యునెస్కో స్మారక వారసత్వ పరదాను కలిగి ఉన్నాయి. సెయింట్ పీటర్స్ కేథడ్రల్ వంటి మధ్యయుగ కాలపునాటి అనేక భవనాలు ఈ నగరం నిండా కనబడతాయి. వీటన్నిటినీ మించి ప్రపంచ దృష్టిని పోర్టా నిగ్రా సమీపంలోని ఒక రెండస్థుల బరోక్ భవనం ఆక్రమించింది. ఈ భవనంలోనే విశ్వవిఖ్యాత తత్వశాస్త్రవేత్త, ఆర్థిక శాస్త్రవేత్త చరిత్రను ఔపోసన చేసినవాడు, మానవ పుట్టుకనుండి రాజకీయ, ఆర్థిక సంబంధాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన సామాజిక ఆర్థికవేత్త సామాజిక స్పృహ కలిగి దోపిడీలకు వ్యతిరేకంగా పోరాట స్ఫూర్తిని నింపిన ఆలోచనాపరుడు, ప్రపంచ ప్రసిద్ధ 'కమ్యూనిస్టు మేనిఫెస్టో' రచయితలో ఒకరిగా నిల్చిన కార్ల్ మార్క్స్ మే5, 1818 సంవత్సరంలో ఈ నగరంలోనే జన్మించాడు. కార్ల్‌మార్క్స్ తన 17వ ఏటవరకూ ఈ నగరంలోని ఫ్రెడరిక్ విల్‌హెమ్ జెమ్నాని సాయంతో తన స్కూల్ విద్యను పూర్తిచేసి తదుపరి ఉన్నత విద్యకై బోన్, బెర్లిన్ నగరాలకు వెళ్లాడు. ఈ నగర ప్రాముఖ్యతను 1904వరకూ ప్రపంచం అంతగా గుర్తించనప్పటికీ, ఆ తర్వాత సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఈ ఇంటిని వశపర్చుకోడానికి ప్రయత్నించి 1928లో విజయం సాధించింది. 1933లో హిట్లర్ నాజీపార్టీ అధికారంలోకి వచ్చాక ఈ భవనం జప్తుకు గురైంది. తదనంతరం ప్రింటింగ్ హౌస్‌గా మార్చారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మే 6, 1947లో ఈ భవనాన్ని కార్ల్‌మార్క్స్ జీవితం, రచనల మ్యూజియంగా ప్రారంభించారు. 1968లో ఫ్రెడరిక్ ఎబర్ట్ ఫౌండేషన్‌లో విలీనం చేశారు. ఈ ఫౌండేషన్ ఎస్‌పీడీకి సన్నిహితమైనది. 1983 మార్క్స్ 100వ వర్ధంతినాడు భవనాన్ని మూడు అంతస్థులకు విస్తరించి పునర్నిర్మాణం తర్వాత తిరిగి తెరిచారు.

2018 సంవత్సరంలో ఈ నగరంలో కార్ల్‌మార్క్స్ ద్వి శతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా ట్రైయర్ కౌన్సిల్ తీర్మానంలో 2300 కిలోల బరువుగల కాంశ్య విగ్రహాన్ని చైనా బహూకరించగా ఆవిష్కరించారు. ఈ విగ్రహం సుమారు 19 అడుగుల ఎత్తు ఉంటుంది. "కార్ల్‌మార్క్స్ ఈ నగరానికేగాక ప్రపంచ సుప్రసిద్ధ పౌరులలో మేటి పౌరుడు. దానిని మనం దాచకూడదు." అని ట్రైయర్ మేయర్ ఉల్‌ఫ్రామ్ లీబే అన్నారు. ఫ్రాక్ కోటులో ఆలోచనాత్మకంగా ఉన్న మార్క్స్



ఎడమపాదంతో ముందుకు వెళ్తున్నట్లు ఈ విగ్రహాన్ని చిత్రీకరించారు. ఇటువంటి చారిత్రాత్మక నగరంలో ఉన్న కార్ల్ మార్క్స్ మ్యూజియంను, కాంశ్య విగ్రహాన్ని ప్రస్తుతం జర్మనీలో ఉన్న నాకు సందర్శించుకునే సదవకాశం 10రోజుల క్రితం నాడు దక్కింది. ఆ మహనీయుని విగ్రహానికి మనందరి తరపున, విజయవాడ కార్ల్ మార్క్స్- ఏంగెల్స్-లెనిన్ విగ్రహాల కమిటీ తరపున నివాళులు అర్పించే అరుదైన అవకాశం నాకు దక్కింది. ఉత్కంఠగా జరిగిన నా ప్రయాణం విగ్రహం ముందు మార్క్స్ మ్యూజియం ముందు నిల్చున్నప్పుడు నా మనోభావాలు వర్ణనాతీతమైనవి. ప్రపంచంలో ప్రతి కమ్యూనిస్టు, సామాజిక ప్రగతిశీల మార్పు కోరుకునే ప్రతివ్యక్తి ఈ నగరానికి రావాలనుకోవడం అతిశయోక్తి కాదేమో! 2019లో విగ్రహావిష్కరణ తర్వాత మ్యూజియంలోని అతిథుల పుస్తకంలో సందర్శకులు అనేక వందల మంది తమ అభిప్రాయాలను రాశారు. వాటిలో కొన్నింటిని ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్ ఆన్‌లైన్ పత్రికలో, ఈ క్రింద ఉదహరించిన కొన్ని అభిప్రాయాలను కార్ల్ మార్క్స్ గురించి ఉంచింది. -'ఒక స్నేహితుడు' 'నాకు మానవజీవితంపై అవగాహన కల్పించిన వ్యక్తికి' ధన్యవాదాలు.

-'నా రోల్ మోడల్' 'తను తరిగివచ్చాడు' 'అభినవ కమ్యూనిస్టు'

-'ది గ్రేటెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ రియాలిటీ' -'కూల్' - 'మార్క్స్ స్టాండ్స్‌ఫర్ హ్యూమానిటీ' - 'మేము కార్ల్‌మార్క్స్ వారసులం' - 'ధైర్యవంతుడు, సాహసీలి'

-'ఒక సామాన్య మానవుడు మన కళ్లు తెరిపించాడు.' - 'స్వాతంత్ర్య సమరయోధుడు'

-'మానవత్వ విమోచకుడు' - 'ఒక మార్గ దర్శకుడు' - మనం మనం కోసం ఆలోచిస్తున్నామా- 'ఆలోచించండి, గుర్తించండి, పనిచేయండి, పురోగతి సాధించండి'

-' విప్లవం కోసం చిరకాలం జీవించండి'

-''ఇప్పటివరకు తత్వ వేత్తలు ప్రపంచాన్ని వివిధ మార్గాల్లో మాత్రమే అర్థం చేసుకున్నారు. అయితే దానిని మార్చటమే ప్రధాన విషయం' అంటాడు కార్ల్ మార్క్స్. కార్ల్ మార్క్స్ జన్మించి 206 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా కార్ల్ మార్క్స్ తత్వంలో ఉన్న లోతైన ఆలోచన, సందేశం కోసం ప్రపంచ ప్రజలంతా ఆన్వేషణచేసి తన నినాదం 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి' కోసం కృషిచేయాలి. ప్రపంచ శ్రామికులు, కర్షకులు, అభ్యుదయ మేధావివర్గం, మధ్యతరగతి ప్రజల దోపిడీకి గురవుతున్న ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడానికి నడుం బిగించాలి. ఈ నాటి పెట్టుబడీదారీ ఆర్థికవ్యవస్థ ప్రపంచప్రజల కంటికి కునుకు పట్టనీయడం లేదు. యువత విపరీతమైన నిరుద్యోగంలో సతమతమవుతూ నిరాశావాదులుగా తయారవుతూ నిరుత్సాహమంతు లవుతున్నారు. కొద్దిపాటి ఆదాయాలతో ఉద్యోగాలున్న కుటుంబాలు విద్య, వైద్యం, ఉండేందుకు ఇళ్లు వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. ఆర్థిక అసమానతల మధ్యప్రజలు, ప్రదేశాలు, దేశాల తీవ్ర అశాంతికి, ఒత్తిడులకు లోనవుతున్నారు. లాభార్జనపేరిట సామ్రాజ్యవాద దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాల వనరులకోసం ఒకవైపు ప్రపంచ బ్యాంకు 3 ఎమ్ఎస్‌లను అడ్డం పెట్టుకొంటూ వేరొకవైపు యుద్ధాలకు పాల్పడుతున్నాయి. ఒకవైపు జాతీయత అంటూనే అనేక జాతుల చరిత్రను కాలగర్భంలోకి నెట్టివేస్తున్నారు. పలస్తీనా సమస్య, మణిపూర్ సమస్యలు వంటివి మచ్చు తునకలు మాత్రమే..

లాభాలపేరిట పెట్టుబడీదారీ ఆర్థికవ్యవస్థ వస్తు వినిమయాన్ని పెంచుతూ పర్యావరణ వినాశనానికి కారకులవుతూ భవిష్యత్తు తరాలకు కాంక్రీట్ జంగిల్స్‌ను, ఎడారులను మాత్రమే ఉంచేలా అడుగులు వేస్తున్నారు. ప్రజల అభివృద్ధిపేరిట జీడీపీ ఎదుగుదలను ఆ గణాంకాలను మాయచేస్తూ, పెరిగిన అభివృద్ధి కొద్దిమందికే దక్కేలా చేసే సగటు ఆదాయాలు పెరిగేలా పోజులు కొడ్తున్నారు. పెట్టుబడీదారీ ఆర్థిక వ్యవస్థలో లాభార్జన, పోటీ, స్టాక్‌మార్కెట్లు ప్రజా సంపదను కొల్లగొట్టి ఆర్థిక సంక్షోభాలకు తరచూ దారితీస్తున్నాయి. ప్రజాకొనుగోలుశక్తి పడిపోతున్నది. శాశ్వత పరిష్కారమార్గం చూడమని మార్క్సిజం చెబుతోంది. ఆర్థిక సమస్యల పరిష్కారానికి కార్ల్‌మార్క్స్ 'మిగుల విలువ' అధ్యయనం చేయుట ద్వారా మిగులువిలువ దోపిడీనుండి రక్షింపబడటానికి ఉత్పత్తి సాధనాలను ప్రజలకోసం-సహకార సంఘాలకోసం మళ్లించడం ద్వారా మాత్రమే దోపిడీ పీడననుండి దోపిడీవర్గాల నుండి రక్షించుకోగల్గుతారు. ఆ విధంగా 'మార్చటం' కోసమే కార్ల్‌మార్క్స్ తన జీవిత కాలం కృషి సల్పారు. దానికే మరొకపేరు సోషలిస్టు సమాజ స్థాపనగా అర్థం చేసుకుందాం. కార్ల్‌మార్క్స్ జయంతి ద్వారా ఆయన ఆశయసాధనకోసం పయనిద్దాం. అవే మనం కార్ల్ మార్క్స్‌కు ఇచ్చే నిజమైన నివాళి. అజేయమైనది మార్క్సిజం-లెనినిజం.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు
సెల్: 849491969

భౌతికవాదాన్ని తవ్వితీసిన దేవీప్రసాద్ చటోపాధ్యాయ

డాక్టర్ దేవరాజు మహారాజు

చార్వాక- లోకాయత అనేది భారతీయ తాత్విక దృక్పథంలో ప్రధానమైంది. ప్రపంచానికే తొలిసారి భౌతికవాదం గురించి చెప్పిన దేశం-మన భారత దేశం ! ఆ విషయం భారతీయులందరూ సగర్వంగా చెప్పుకోవాల్సింది పోయి, మనువాదుల చేతుల్లో కీలు బొమ్మలై, కల్పనల్లో ఊహించుకున్న దేవీ దేవతల మూర్తులకు పూజలు చేస్తూ దిగజారిపోయారు. నిజాలను వదిలి, అబద్ధాల వెంట పరుగులు పెట్టారు. అలా శతాబ్దాలు గడిచిపోయాయి.దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ లాంటి వివేకవంతులు ఆధునిక కాలంలో కూడా భౌతికవాద ప్రాశస్త్యాన్ని ఎలుగెత్తి చెబుతూనే ఉన్నారు. కానీ, కళ్ళుమూసుకుని, తలవంచుకుని గొర్రెల్లా బతికే జనం వారి హెచ్చరికల్ని పట్టించుకోలేదు. శూన్యాన్ని మహాశక్తిగా విశ్వసిస్తూ వస్తున్నారు. సమకాలీనంలో పరిస్థితులు చాలా ప్రమాదకరంగా తయారయ్యాయి. అయితే, ఈ పరిస్థితి తప్పకుండా మారుతుంది. రాగల కాలాలలో బుద్ధుడు చెప్పిన ' అత్ దీపోభవ' (నీవే దీపానివి అయిపో) అన్న మాటని గుండెల్లో నింపుకుని వైజ్ఞానిక భౌతిక మానవవాదానికి దారులు వేశారు. తప్పదు !! ఇక్కడి చార్వాక-లోకాయత ఆలోచనా విధానాన్ని మనువాదులు అన్యాయంగా అణగదొక్కారు. భూ స్థాపితం చేశారు. తమ కట్టుకథల్ని ప్రచారం చేసుకుని అదే మన సంస్కృతి, అదే మన సంప్రదాయం అని బుకాయించారు. అయినా భౌతిక వాదం ఎక్కడికీ పోలేదు. ఈ నేలలోనే ఉంది. లోకాయత అంటే లోకేషు ఆయతః - అని అర్థం ! అంటే లోకంలో వ్యాప్తి చెందిన ప్రజల దృక్పథం - అని అర్థం. వీరు లోకాన్నే విశ్వసిస్తారు. ఎక్కడా లేని ఇతర లోకాలను నమ్మరు. లోకంలోని లోకులను మాత్రమే విశ్వసిస్తారు. లోకాయత ప్రజల తత్త్వ శాస్త్రం. ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలు జరగకముందే - సాధారణ శకానికి ముందు (బిసిఇ) లోకాయతులు' ప్రపంచ మే వాస్తవం'- అన్నారు. నాలుగైదు మూలకాల సంయోగం వల్లనే ఈ ప్రపంచం ఏర్పడిందన్నారు. నీరు, నిప్పు, గాలి, భూమి - నాలుగు మూలకాలయితే, అయిదోది ఆకాశం అన్నారు. చైతన్యం అనేది పంచభూతాల నుండి వస్తుందన్నారు. ' భూతే బాహ్య చైతన్యం! మనుషులందరి శరీరాలు ఒక్కటే- ముక్కు, ముఖం, చేతులు, కాళ్ళు అందరికీ ఒకేలా ఉన్నప్పుడు, జీవన క్రియలు ఒకేలా జరుగుతున్నప్పుడు... ఈ వర్ణ వ్యవస్థ ఎందుకూ? ఈ కులాల తారతమ్యాలు ఎందుకూ? అసలు అవి ఉండాల్సిన అవసరం ఏమిటీ - అని లోకాయతులు సాధారణ శకానికి ముందే ప్రశ్నించారు. వీరే అతి ప్రాచీన భారతీయ భౌతిక వాదులు. ఈ ప్రపంచాన్ని ఏ శక్తి నడిపించడం లేదనీ, ఆత్మ, పునర్జన్మ, మోక్షం వంటివి ఉండవని చాటి చెప్పారు. 1918-1993 మధ్య కాలంలో... దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ - అనే మార్క్సిస్టు మేధావి, తత్వవేత్త ముందుకొచ్చాడు. వైదిక ధర్మ ప్రచారకుల





వేదాల అబద్ధాలని కూల్చి వేస్తూ - వారు భూస్థాపితం చేసిన భారతీయ భౌతిక వాదాన్ని, అదే భూమి పొరల్లోంచి తవ్వితీశారు. ఒకప్పుడు దేశంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న లోకాయత- చార్వాక తాత్వికతను దేశ ప్రజలకు విడమర్చి చెప్పాడు. వైదిక పురాణాలు ప్రచారం చేసిన భ్రమల్ని బద్దలు కొట్టాడు. అన్నింటికీ "కారణం" - హేతువు ప్రధానమనీ, అది వైజ్ఞానిక అవగాహన మీద ఆధారపడి ఉండాలనీ చెప్పిన మహనీయుడాయన ! తొలిసారి తత్వశాస్త్రాన్నీ, వైజ్ఞానికతనూ కట్టగట్టి, కొత్త ఆలోచనలకు దారులు వేసిన పరిశోధకుడాయన ! చరిత్రకూ, సామాజిక ఆర్థిక, రాజకీయ అంశాలకు సైన్సు వెన్నెముక కావడం మనం చూశాం. కానీ, దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ కొత్తగా ఫిలాసఫీకి, సైన్సుకూ ఉన్న సంబంధాన్ని హేతుబద్ధంగా చెప్పి నిరూపించారు! ప్రాచీన భారతీయ భౌతిక వాదాన్ని అధ్యయనం చేసి, ఆయన ప్రకటించిన 'లోకాయత' మాత్రమే కాదు, వైజ్ఞానిక శాస్త్రాల చరిత్రను, ప్రాచీన భారత దేశంలో వైజ్ఞానిక పద్ధతుల్ని ఆయన గ్రంథాలుగా ప్రకటించారు. ఇవే కాకుండా ప్రాచీన భారత దేశంలో విజ్ఞాన శాస్త్రం - సమాజం వంటి గ్రంథాలు బహుళ ప్రజాదరణ పొందాయి. ఆయన గ్రంథం లోకాయత -1959 దేశంలోనే కాదు, విదేశాల్లోనూ సంచలనం సృష్టించింది. భారతీయ మార్క్సిస్టు తాత్త్వికత గూర్చి ప్రపంచానికి ఒక కొత్త అవగాహనను కలిగించింది. దేవీప్రసాద్ చటోపాధ్యాయ (19 నవంబర్ 1918-8 మే 1993) రచనలు ' సైన్స్ అండ్ సొసయిటీ ఇన్ ఏన్సియంట్ ఇండియా సంపుటాలు, వాట్ ఈజ్ లివింగ్ అండ్ వాట్ ఈజ్ డెడ్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ, ట్రూ ట్రెండ్స్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ, రిలిజియన్ అండ్ సొసయిటీ వంటి గ్రంథాలు తిరగేస్తే ఒకప్పుడు ప్రపంచానికి భౌతిక వాదం బోధించిన భారతదేశం ఈరోజు ఎందుకు ఇలా కుప్పగూలిపోయిందో అర్థమవుతుంది. అంతేకాదు, దాన్ని పునరుద్ధరించు కోవాల్సిన బాధ్యత నేటి యువతరం మీద ఎంత ఉందో అంచనా వేసుకోవడానికి వీలవుతుంది. కార్యాచరణకు ప్రేరణ లభిస్తుంది. చార్వాకుడు ఒక నాటి రుషి. అతను ప్రపంచంలోనే మొట్టమొదటిసారి భౌతికవాదం గురించి ఆలోచించాడు. బృహస్పతి ఆ ఆలోచనకు ఒక రూపం ఇచ్చాడు. పైగా చార్వాకుడి పేరుతోనే ఆ ఆలోచనా విధానాన్ని 'చార్వాకం ' అని అన్నాడు. మాధవాచార్య ఆ పదానికి అర్థం చెప్పాడు. చారూ - అంటే తియ్యని అనీ, వాక్ అంటే వాక్కు - మాట- అనీ చెప్పాడు. యదార్థాల్ని సున్నితంగా చెప్పడం - అని కూడా మనం అనుకోవచ్చు. చార్‌వాక్‌కు మరొక అర్థం కూడా ఉంది. వారు ప్రతిపాదించినవి నాలుగు విషయాలు (నాలుగు వాక్కులు) గనక, వారి ఆలోచనా ధోరణిని 'చార్వాక'- అని కూడా అన్నారు.

1. యావత్ జీవేతూ సుఖ జీవేతూ (జీవితాంతం సుఖంగా జీవించు) 2. రుణమూ కృత్వా ఘృత పీ వేతూ (అప్పు చేసైనా నెయ్యి తాగు). 3. భస్మీ భూతస్య దేహస్య (కాలిపోయి బూడిద అయ్యేదే ఈ దేహం) 4. పునరాగమన కృతః (మళ్ళీ తిరిగి వస్తుందని ఎలా అనుకుంటావూ?) నెయ్యి తాగు - అంటే ఇక్కడ నెయ్యి అనే కాదు. శరీరానికి అవసరమైన పౌష్టికాహారం అని అర్థం. చనిపోయాక ఈ దేహం కాలిస్తే బూడిద అవుతుంది. పూడిస్తే మట్టి అవుతుంది. అంతేగానీ, ఇక పునరాగమనం ఎక్కడా? శరీరం ఎలా తిరిగివస్తుందీ అని ప్రశ్నించారు. అంటే పునర్జన్మ అబద్ధమనీ, అది ఉండదనీ చెప్పారు. మోక్షానికి కూడా ఆధారం లేదన్నారు.

శరీరమే ముఖ్యం -వైదిక మతస్థులు చెప్పే ఆత్మ ఉండాలన్నా కూడా శరీరం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి - కదా? అప్పు చేసైనా సుఖంగా ఉండు -అని అన్నది ఎందుకంటే - అప్పు తీసుకున్న వాడు, అప్పు ఇచ్చినవాడూ ఇద్దరూ ఏదో ఒక నాటికి నశించాల్సిన వాళ్ళే. కాని, జీవిని, ప్రాణాన్ని కష్టపెట్టకుండా కాపాడుకొమ్మని చార్వాకులు చెప్పారు. మిథ్యావాదాన్ని నమ్మగూడదని - అన్నారు. సంశయ వాదం, సందేహవాదాన్ని ప్రమాణంగా తీసుకోలేదు. కర్మ ఫలం ఉండదు. స్నేహితులతో, బంధువులతో బతికినంతకాలం సంతోషంగా గడపడమే జీవితం. వారినందరినీ పక్కకు నెట్టి, ఎక్కడా లేని పరలోక సుఖాల కోసం పూజలు, యజ్ఞాలు చేయ డం మూర్ఖుల లక్షణం - అని అన్నారు. తర్కాన్ని అనుభవాన్ని - శరీరాన్ని మాత్రమే నమ్ముకోవాలి. అంతేగాని, ఆత్మను, పునర్జన్మను, స్వర్గ నరకాలను, కర్మకాండను నమ్ముకోగూడదన్నది వారి సిద్ధాంతం! వైదిక ధర్మంలో యజ్ఞయాగాలకు, జంతు బలులకు చాలా ప్రాముఖ్యం ఉంది. ప్రకృతిని పరిరక్షించుకోవాలని భావించే చార్వాకులు -లోకాయతులు పశువుల్ని, పక్షుల్ని ఇతర జీవరాసుల్ని అమితంగా ప్రేమించేవారు. అందుకే జంతు బలుల్ని తీవ్రంగా అడ్డుకున్నారు. బలి ఇచ్చిన పశువులు స్వర్గానికి వెళ్ళేదైతే ఈ వైదిక పండితులు వృద్ధాప్యంతో సతమతమయ్యే తమ తండ్రిని బలి ఇచ్చి నేరుగా స్వర్గం పంపొచ్చు కదా?- అని సవాలు విసిరారు. లోకాయతుల అర్థవంతమైన ప్రశ్నలకు జవాబు చెప్పలేక వైదిక ధర్మప్రభోదకులు వక్ర భాష్యాలు చెప్పి, అణగదొక్కారు! భౌతిక దాడులకు పూనుకుని చార్యాకుల్ని బానిసలుగా మార్చారు. ఆడవారిపై అత్యాచారాలు చేశారు. కుట్ర పూరితంగా వారి గ్రంథాల నన్నింటినీ నాశనం చేశారు. కాల్చేశారు. అందుకే చార్వాక-లోకాయతలపై వెలువడ్డ ప్రాచీన గ్రంథాలు మనకు దక్కలేదు. దేవీప్రసాద్ చటోపాధ్యాయ లాంటి పరిశోధకుల కృషితో కొంతలో కొంత సమాచారం బయటికొచ్చింది. ఏది ఏమైనా 'నాస్తికో వేద నిందక' (నాస్తికులు వేదాలను ఒప్పుకోరు - నిందిస్తారు) అన్న భావన లోకంలో స్థిరపడింది. చార్వాక- జ్ఞాన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది . అంటే థియరీ... ఆఫ్ నాలెడ్జ్. ప్రత్యక్ష ప్రమాణాలుంటేనే దేనినైనా స్వీకరించాలని ఈ సిద్ధాంతం చెప్పింది. ప్రత్యక్ష అనుభవం అనేది రుచి, వాసన, స్పర్శ, దృష్టి, శబ్దం వల్ల గ్రహించొచ్చు. జ్ఞానేంద్రియాలకు అందని భ్రమలు - కల్పితాలు ! అప్రత్యక్ష విశ్వాసాల్ని భౌతికవాదం పరిగణనలోకి తీసుకోదు. చార్వాక 'థియరీ ఆఫ్ రియాలిటీ' ని నమ్ముతుంది. గాలి, నీరు, అగ్ని, భూమితోనే ప్రతి పదార్థం రూపొందుతుంది గనక, "పదార్థమే" జీవనానికి ప్రధానం అన్నారు. మేటర్‌ని గుర్తిస్తుంది గనక, ఈ సిద్ధాంతం "మెటీరియలిజం" అయ్యింది. జీవించి ఉన్న ప్రాణిలోని స్పృహను వైదికధర్మం 'ఆత్మ' అని భావించింది. తప్పితే ఆత్మ అనేది లేదన్నది చార్వాకులు గట్టిగా నమ్మారు. చెప్పారు కూడా! 'దేబీదా' గా ప్రేమగా పిలవబడ్డ దేవీప్రసాద్ చటోపాధ్యాయ చదువుకునే రోజుల్లో డిగ్రీ, పీజీలోనూ గోల్డ్ మెడల్స్ సాధించారు. తత్వశాస్త్ర విద్యార్థిగా, అధ్యాపకుడిగా ఒక కొత్త ఒరవడి సృష్టించినందుకు- చివరి దశలో ఆయనను-నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్- సగౌరవంగా 'గెస్ట్ సైంటిస్ట్'గా నియమించుకుంది ! ఇది చాలా అరుదైన విషయం ! ఆయన కృషిని, గుర్తించి 1998లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించింది. సమకాలీనంలో యువత 'దేబీదా' అడుగుజాడల్లో వైజ్ఞానిక - భౌతిక - మానవవాదాలకు దారులు వేస్తారు తప్పదు!!

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త
మెల్బోర్న్ నుంచి

బీజేపీ గూటికి కాంగ్రెస్ మాజీ నేత లవ్లీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ మాజీ అధ్యక్షుడు అరవిందర్ సింగ్ లవ్లీ ఆ పదవి నుంచి వైదొలిగిన కొద్ది రోజుల తర్వాత మళ్లీ బీజేపీలో చేరారు. ఇంతకుముందు ఆయన బీజేపీలో చేరనని చెప్పారు. టికెట్ పంపిణీపై మనస్తాపానికి గురైనందునే తాను కాంగ్రెస్ పదవిని వదులుకున్నట్లు పేర్కొనడాన్ని లవ్లీ ఖండించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖలో... అవినీతి కేసులకు సంబంధించి చాలా మంది ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మంత్రులకు జైలు శిక్ష విధించడాన్ని లవ్లీ ఎత్తి చూపారు. 'అయినప్పటికీ లోక్‌సభ ఎన్నికల కోసం అరవింద్ కేజ్రీవాల్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది' అని తెలిపారు. లవ్లీ 2015లో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ అధ్యక్ష పదవి నుంచి వైదొలిగారు. 2017లో బీజేపీలో చేరిన ఆయన తొమ్మిది నెలల తర్వాత తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా సమక్షంలో లవ్లీ బీజేపీలో చేరారు. లవ్లీతో పాటు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు రాజ్ కుమార్ చౌహాన్, నసీబ్ సింగ్, నీరజ్ బసోయా, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అమిత్ మల్లిక్ కూడా బీజేపీలో చేరారు.

బెంగాల్ గవర్నర్‌పై సమగ్ర విచారణ

ఆర్జేడీ నేత మిసాభారతి డిమాండ్

పాట్నా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆర్జేడీ నేత మిసా భారతి శనివారం డిమాండ్ చేశారు. ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ పెద్ద కుమార్తె కూడా మిసా భారతి... వారసత్వ రాజకీయాల అంశంపై ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకున్న బీజేపీపై విరుచుకుపడ్డారు. ప్రభావవంతమైన రాజకీయ కుటుంబాల నుండి వచ్చిన అనేక మంది నాయకులు ఆ పార్టీలో ఉన్నారని ఆమె అన్నారు. 'పశ్చిమ బెంగాల్ గవర్నర్‌పై అభియోగాలు ఆందోళన కలిగించే విషయం. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి' అని మిసా అన్నారు. "బీజేపీతో ఉన్న వ్యక్తులు అన్ని తప్పుల నుండి తప్పించుకోగలరని అనిపిస్తోంది. కుటుంబ రాజకీయాల అభియోగాన్ని చూడండి. ఈ విషయంపై వారు మాపై విరుచుకుపడతారు. వారు తమను తాము ఎందుకు చూసుకోరు? చాలా మంది కుటుంబ రాజకీయ నేపథ్యం ఉన్నవారిని బీజేపీ ఆదరించింది' అని ఆమె అన్నారు. రాజ్యసభ సభ్యురాలిగా ఉన్న ఈమె పాటలీపుత్ర లోక్‌సభ స్థానం నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ విషయంపై తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కూడా స్పందించిన సంగతి విదితమే. రాజ్‌భవన్‌లో పనిచేసిన ఓ యువతి బయటకు వచ్చి గవర్నర్ వేధింపులకు వ్యతిరేకంగా మాట్లాడింది. ఆ మహిళ కన్నీళ్లకు నా గుండె పగిలింది. సందేశ్‌ఖాలీ గురించి మాట్లాడే ముందు బీజేపీ దీనికి సమాధానం చెప్పాలని ఆమె నిలదీశారు. రాజ్‌భవన్‌లో అభాగ్యురాలైన మహిళ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత కూడా అక్కడ ఒకరోజు బస చేయడానికి వచ్చిన ప్రధాని మోదీ మౌనం వహించడాన్ని ఆమె ప్రశ్నించారు.

ప్రచారానికీ డబ్బుల్లేవ్...పోటీ చేయలేను

పూరీ కాంగ్రెస్ అభ్యర్థి సుచరిత వెల్లడి

భువనేశ్వర్: ఒడిశాలోని పూరీ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని సుచరిత మొహంతీ పోటీకి నిరాకరించారు. పార్టీ టికెట్ తిరిగి ఇచ్చేశారు. ప్రచారానికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు పార్టీ నిరాకరించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నిధుల లేమి తన నియోజకవర్గంలో ప్రచారంపై తీవ్రంగా పడిందని పేర్కొంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్‌కు ఆమె ఈ-మెయిల్ చేశారు. సుచరితా మొహంతి కాంగ్రెస్ మాజీ ఎంపీ బ్రజమోహన్ మొహంతీ కుమార్తె. తాను వృత్తిపరంగా జీతంతో బతికే జర్నలిస్టునని, పదేళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చానని, ప్రచారం కోసం తన దగ్గర ఉన్నందంతా ఇచ్చేశానని ఆమె తెలిపారు. ప్రచారానికి ప్రజల నుంచి విరాళాలు సేకరించినా పెద్దగా ప్రయోజనం లేకపోయిందని, దీంతో ప్రచార ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నించానన్నారు. పూరీలో విజయవంతంగా ప్రచారం సాగించడానికి నిధుల కొరత ఉందనేది సుస్పష్టమని, నిధులు లేకుండా పూరీలో ప్రచారం సాగించడం ఎంత మాత్రం సాధ్యం కాదని సుచరిత పేర్కొన్నారు. ఆ కారణంగానే పార్టీ లోక్‌సభ టికెట్‌ను వెనక్కి తిరిగి ఇచ్చేస్తున్నానని ఏఐసీసీకి పంపిన ఈ-మెయిల్‌లో సుచరిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు విధేయ కార్యకర్తగానే తాను కొనసాగుతానని, తన నేత రాహుల్ గాంధీ అని ఆమె స్పష్టం చేశారు. పూరీ నియోజవర్గంలో సంబిత్ పాత్రను తమ అభ్యర్థిగా బీజేపీ నిలబెట్టగా, ముంబై మాజీ పోలీస్ కమిషనర్ అరూప్ పట్నాయక్ బీజేడీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నారు.

మోదీ పోటీ చేస్తే ఎందుకు అడగలేదు?

మీడియాపై వేణుగోపాల్ అసహనం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ రెండు చోట్ల పోటీ చేసినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాను నిలదీశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రెండు నియోజకవర్గాల నుంచి బరిలో దిగుతుండటంపై మీడియా ప్రశ్నించడంతో కేసీ వేణుగోపాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి బరిలో దిగుతున్నారు. రాహుల్ పోటీపై బీజేపీ నేతల వ్యాఖ్యల గురించి మీడియా ప్రతినిధులు కేసీ వేణుగోపాల్ ముందు ప్రస్తావించగా ఆయన అసహనం వెలిబుచ్చారు. అది పార్టీ నిర్ణయమని, పార్టీకి నమ్మకస్తుడైన సైనికుడు పార్టీ నిర్ణయాన్ని శిరసావహించడం ఆయన బాధ్యతని వేణుగోపాల్ అన్నారు. రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయడం ఏమన్నా తప్పా... మాజీ ప్రధాని అతల్‌బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ ఒకటి మించిన నియోజకవర్గాల్లో పోటీ చేశారుగా అని గుర్తుచేశారు. వాజ్‌పేయి మూడు నియోజకవర్గాల్లో పోటీ చేసినప్పుడు... అన్ని నియోజకవర్గాల్లో ఎందుకు పోటీ చేస్తున్నారని మీ మీడియా ప్రశ్నించిందా అని వేణుగోపాల్ మండిపడ్డారు. 2014లో మోదీ రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసినప్పుడు ప్రశ్నించారా అని అడిగారు. రాహుల్‌గాంధీ రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నట్లుగా ప్రకటించగానే మీ మీడియా అంత రాద్ధాంతం ఎందుకు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో ఏ సమస్య లేనట్టు రాహుల్‌గాంధీ మీదనే మీ చర్చలు ఎందుకని మండిపడ్డారు. ప్రతిపక్ష కూటమి దక్షిణ భారతదేశాన్ని ప్రత్యేక దేశంగా విడదీసే ప్రయత్నం చేస్తున్నదన్న మోదీ అడ్డగోలు ఆరోపణలపై మీ మీడియా ఎందుకు చర్చకు పెట్టదని వేణుగోపాల్ నిలదీశారు. దేశంలో నిరుద్యోగం మీద, మహిళలపై బీజేపీ నేతలు చేస్తున్న అకృత్యాల మీద, రోజురోజుకు పెరిగిపోతున్న ధరల మీద చర్చలు పెట్టాలనే ఆలోచన మీకు ఎందుకు రావడం లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థుల మృతి

డెహ్రాడూన్: విహారయాత్రకు వెళ్లిన ఐదుగురు విద్యార్థులు ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాద ఘటన ఉత్తరాఖండ్‌లోని పానీవాలా బ్యాండ్ సమీపంలో చోటుచేసుకుంది. డెహ్రాడూన్ ఐఎమ్ఎస్ కాలేజీకి చెందిన నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు విహారయాత్రకు వెళ్లారు. అక్కడ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో పానీవాలా బ్యాండ్ సమీపంలో లోతైన గుంటలో కారు పడిపోయింది. దీంతో కారులో ఉన్న ఆరుగురిలో ఐదుగురు మృతి చెందారు. నాన్సీ అనే యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాయాలపాలైన యువతిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న యువతి పరిస్థితి విషమంగా ఉందని ఎస్పీ ప్రమోద్ కుమార్ తెలిపారు.

దక్షిణ ఢిల్లీ నుంచి ట్రాన్స్‌జెండర్ పోటీ

రాజధానిలో ఇదే మొదటిసారి

న్యూఢిల్లీ: తొలి థర్డ్ జెండర్ వ్యక్తి లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేశాడు. 26 ఏళ్ల రాజన్ సింగ్ దక్షిణ ఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ కోసం నామినేషన్ వేశాడు. ధోతీ, టోపీ, ఆభరణాలు ధరించిన అతడు ఒంటరిగా వచ్చి సాకేత్‌లోని దక్షిణ ఢిల్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించాడు. చేతిలో లక్ష నగదు, 200 గ్రాముల బంగారం, బ్యాంకు ఖాతాలో రూ.10 వేలకుపైగా డబ్బు కలిపి సుమారు రూ.15.10 లక్షల చరాస్తులున్నట్లు అఫిడవిట్‌లో ప్రకటించాడు. అయితే ఎలాంటి స్థిరాస్తులు లేవని పేర్కొన్నాడు. 2010లో బీహార్ నుంచి వలస వచ్చి ఢిల్లీలోని సంగమ్ విహార్ ప్రాంతంలో నివసిస్తున్నట్లు రాజన్ సింగ్ తెలిపాడు. థర్డ్ జెండర్ వ్యక్తులకు ప్రత్యేక సౌకర్యాలు లేకపోవడం, సామాజిక అంగీకారం, హక్కుల కోసం తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలతో పాటు అధికారుల దృష్టి ఆకర్షించేందుకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పాడు. సుదీర్ఘ ప్రక్రియ వల్ల థర్డ్ జెండర్‌గా ధృవీకరణ ప్రతాలు పొందేందుకు మూడేళ్లకుపైగా పట్టిందని అన్నాడు. థర్డ్ జెండర్ వ్యక్తుల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, సర్వీస్ ప్రొవైడర్ల వద్ద ప్రత్యేక వాష్‌రూమ్‌లు, క్యూలైన్లు వంటి ప్రాథమిక అవసరాలు ప్రభుత్వం కల్పించాలని రాజన్ సింగ్ కోరాడు. విద్యా, ఉద్యోగాల్లో ఒక శాతం రిజర్వేషన్లు కల్పించడంతోపాటు జాతీయ ట్రాన్స్‌జెండర్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాడు. ఎన్నికల్లో తాను గెలిస్తే థర్డ్‌జెండర్ వ్యక్తులకు సంబంధించిన ప్రాథమిక అవసరాలు తీరుస్తానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని మీడియాతో అన్నాడు.

రాజస్థాన్ మంత్రికి హత్యా బెదిరింపులు

జైపూర్: రాజస్థాన్‌కు చెందిన ఓ మంత్రికి హత్య బెదిరింపులు వచ్చాయి. భజన్‌లాల్ శర్మ కేబినెట్‌లో గిరిజన శాఖ మంత్రిగా ఉన్న బాబులాల్‌ను చంపేస్తామంటూ కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు ఆయనను ఇన్‌స్టా ద్వారా బెదిరించారు. ఈ బెదిరింపులపై మంత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం ఈ బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. గిరిజనులను హిందూ మతంలోకి మారుస్తున్నారని ఆరోపిస్తూ మంత్రిని చంపేస్తానని గుర్తు తెలియని వ్యక్తి బెదిరించినట్లు చెప్పారు.

భయం గుప్పిట్లోనే మణిపూర్

ఇంకా ఆయుధశాలకు చేరని దుండగుల చేతుల్లోని ఆయుధాలు

న్యూఢిల్లీ: జాతి హింస చోటుచేసుకున్న ఏడాది తర్వాత కూడా మణిపూర్ ఇంకా భయం గుప్పిట్లోనే ఉంది. గత ఏడాది కాలంగా రాష్ట్రంలోని పోలీసు ఆయుధశాల నుంచి దుండగులు దోచుకున్న అనేక ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఇంకా స్వాధీనం చేసుకోలేదు. వాటిని అప్పగించాలని అనేక సార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ, అనేక అధునాతన ఆయుధాలు ఇప్పటికీ అసాంఘిక శక్తుల చేతుల్లోనే ఉన్నాయి. ఈ పరిస్థితి మణిపూర్‌లో ఇబ్బందులను రేకెత్తిస్తోంది. ఏప్రిల్ 4న బిష్ణుపూర్ జిల్లా సాదు కబుయ్ గ్రామ సమీపంలోని ఖుజోయ్ రోక్ నాలా నుంచి సైన్యం పెద్ద మొత్తంలో అక్రమ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, ఇతర యుద్ధ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఒక ఆంగ్ల వార్తా పత్రిక కథనం పేర్కొంది. ఒక 9 ఎంఎం కార్బన్, మెషిన్ గన్, ఒక స్టెన్ గన్ ఎంకే2, ఒక 303 తుపాకీ, ఒక 9 ఎంఎం పిస్టల్, ఒక అల్లర్ల నిరోధక తుపాకీ, 14 గ్రెనేడ్లు, మందుగుండు సామగ్రి, ఇతర యుద్ధ-వంటి దుకాణాలు వంటి అధునాతన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకోవడానికి సైన్యం, ఎస్ఎస్‌బీ, మణిపూర్ పోలీసులతో కలిసి సంయుక్త కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అదేవిధంగా ఫిబ్రవరి చివరి వారంలో మణిపూర్ పోలీసులు చురాచంద్‌పూర్ జిల్లాలోని రెండు గ్రామాలలో జరిపిన గాలింపు కార్యకలాపాలలో భారీ ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. డి హవోలెంజాంగ్ గ్రామ శివార్లలో నాలుగు తుపాకీలు, ఒక సుదూర భారీ మోర్టార్, మందుగుండు సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు మరొక ఆంగ్ల పత్రిక కథనం వెల్లడించింది. ఫిబ్రవరిలో అదే సమయంలో చురాచంద్‌పూర్‌లోని మోల్‌జాంగ్ గ్రామం నుంచి మరో గాలింపు చర్యల్లో పోలీసు బృందం 10 తుపాకులు, ఎనిమిది జెలెటిన్ స్టిక్స్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుంది.

ఫిబ్రవరిలో మూడవ ఆపరేషన్‌లో ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని కైసంపత్ జంక్షన్ నుంచి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు ఎస్ఎల్ఆర్ తుపాకీలను స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది మే 3న జాతి వివాదం చెలరేగినప్పటి నుంచి మణిపూర్‌లో తరచూ ఆయుధాల దోపిడీ జరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలో విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్ ప్రకటన ప్రకారం, హింస ప్రారంభ రోజుల్లో మణిపూర్ పోలీసు ఆయుధశాల నుంచి దోచుకున్న సుమారు 5,600 ఆయుధాలు, 6.5 లక్షల రౌండ్ల తూటాలు, 1,757 ఆయుధాలు, 22,707 మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

హింసను తీవ్రతరం చేయడంలో ఈ ఆయుధాలు కీలక పాత్ర పోషించాయి. మే చివరి వారం, జూన్ 2023 మొదటి వారంలో మణిపూర్‌లో కర్ఫ్యూ అమలులో ఉన్నప్పుడు చాలా మంది పురుషులు నల్ల దుస్తులు ధరించి, వివిధ వాహనాలపై గుంపులుగా, అధునాతన ఆయుధాలతో ప్రయాణిస్తూ కనిపించారు. రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదయిన, బహిరంగంగా అందుబాటులో ఉన్న కొన్ని ఎఫ్ఐఆర్‌లు, దుండగులు ఏ ఆయుధాలను దోచుకున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ దోపిడీ ఘటనల్లో ఎక్కువ భాగం రాత్రిపూట జరిగినవి కావు. ఆ ఎఫ్ఐఆర్‌ల ప్రకారం, మధ్యాహ్నం తర్వాత లేదా సాయంత్రం జరిగినవి.

బాలుడి ఊపిరితిత్తుల్లోకి ఎల్ఈడీ బల్బు

బ్రాంకోస్కోపి సర్జరీ... కోలుకుంటున్న చిన్నారి

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలో ఓ బాలుడు (5) ఆడుకుంటూ అనుకోకుండా చిన్న ఎల్ఈడీ బల్బు మింగాడు. కంగారుపడ్డ తల్లిదండ్రులు వెంటనే పిల్లాడిని దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లారు. బల్బు బాలుడి ఊపిరితిత్తుల్లోకి వెళ్లినట్లు డాక్టర్లు గుర్తించారు. బాలుడు దగ్గుతుండడంతో పాటు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో ఆపరేషన్ చేసి బల్బు తీయడానికి డాక్టర్లు ప్రయత్నించారు. రెండుసార్లు బ్రాంకోస్కోపి సర్జరీ చేసినప్పటికీ బల్బు బయటికి తీయడం వీలు కాలేదు. దీంతో డాక్టర్లు బాలుడి ఛాతి ఓపెన్ చేసి సర్జరీ చేయాలని తల్లిదండ్రులకు తెలిపారు.

మేజర్ సర్జరీ అని భయపడ్డ తల్లిదండ్రులు బాలుడిని శ్రీరామచంద్ర మిషన్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు సీటీ స్కాన్‌తో బల్బును గుర్తించి బ్రాంకోస్కోపి సర్జరీ ద్వారా తీసివేశారు. దీంతో బాలుడి ఆరోగ్యం కుదుటపడింది. బాలుడు త్వరలోనే కోలుకుంటాడని డాక్టర్లు తెలిపారు.

చక్రవర్తికి రైతుల, సామాన్యుల కష్టాలు కనిపించవు

మోదీ 'యువరాజు' వ్యాఖ్యలకు ప్రియాంక కౌంటర్

బనస్‌కాంత (గుజరాత్): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని యువరాజుగా సంబోధిస్తూ కాంగ్రెస్ పార్టీపై వ్యంగ్య బాణాలు సంధిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి ప్రియాంకాగాంధీ గట్టి కౌంటర్ ఇచ్చారు. తన సోదరుడు రాహుల్ ప్రజల కోసం 4వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తే... ప్రధాని మోదీ తన రాజభవనంలో కూర్చుని రైతుల దుస్థితిని పట్టించుకోవడం లేదని ప్రియాంక తీవ్రంగా విమర్శించారు. గుజరాత్‌లోని బనస్‌కాంత లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి జెనిబెన్ ఠాకూర్‌కు మద్దతుగా లఖానీలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ... 'నా సోదరుడిని ఆయన షెహజాదా (యువరాజు) అని పిలుస్తారు. నా సోదరుడు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి రైతులను, కూలీలను, యువకులను కార్మికులను కలిసి. వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. మరోవైపు రాజులకేరాజైన మన చక్రవర్తి (నరేంద్ర మోదీ)రాజభవనాల్లో ఉంటారు. నిస్సహాయ రైతులు, మహిళల అవస్థలు ఆయనకు ఏ విధంగా అర్థమవుతాయి? అధికారం ఆయన చుట్టూ ఉంది. ఆయన చుట్టూ ఉండే వాళ్లు ఆయనను చూసి భయపడిపోతుంటారు. ఎవరూ ఆయనకు ఒక్క మాట కూడా చెప్పలేరు. ఎవరైనా ఒకవేళ తన గొంతు వినిపించాలనకున్నా వారి గొంతు అణగదొక్కేస్తుంటారు' అని ప్రియాంక చెప్పారు. ప్రధానమంత్రి బడా వ్యక్తుల గురించే పట్టించుకుంటారు కానీ పేదలు, సామాన్య ప్రజానీకం గోడు ఆయనకు పట్టదని ప్రియాంక విమర్శించారు. గుజరాత్ ప్రజలు మోదీని గౌరవించి ఆయనకు అధికారం కట్టబెట్టారని...కానీ ఆయన బడా వ్యక్తుల గురించే ఆలోచిస్తుంటారన్నారు. మోదీ కనీసం ఒక్క రైతునైనా కలుసుకోవడం మీరు ఎప్పుడైనా చూశారా? వారిని కలుసుకునే ప్రయత్నం కూడా చేయరు. ఎన్నికలు ముంచుకొచ్చి... తమకు ఓట్లు రావని తెలుసుకున్న తర్వాత ప్రధాని మోదీ చట్టాలను మారుస్తామంటున్నారని ప్రియాంక ఎద్దేవా చేశారు. ప్రధాని చాలా అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆమె ఆరోపించారు. 'మొదట్లో ఇది అబద్ధాలకే పరిమితమైందని, ఇప్పుడు మీ రెండు గేదెలలో ఒకదాన్ని కాంగ్రెస్ దొంగిలించబోతోందన్నంత చులకనగా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ 55 ఏళ్లుగా అధికారంలో ఉంది, ఎప్పుడైనా ఎక్స్‌రే మిషన్‌తో మీ గేదెలు, నగలు దోచుకున్నారా' అని ప్రియాంక ప్రశ్నించారు. ఎన్నికలను హిందూ-ముస్లిం సమస్యగా మార్చవద్దని... కరెంటు, నీళ్లు, ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం గురించి మాట్లాడాలని ప్రజలు కోరుకుంటున్నందున ప్రధాని ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఆమె అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అమూల్, బనాస్ డెయిరీ వంటి సహకార రంగాలను ఏర్పాటు చేసిందని, నేడు ఆ రంగాన్ని బీజేపీ నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె మండిపడ్డారు.

రాజ్యాంగాన్ని మార్చే యత్నం

భారత రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కోరుకుంటోందని ప్రియాంక పేర్కొన్నారు. 'ప్రజలకు రాజ్యాంగం హక్కుల్ని ప్రసాదించింది. అన్నింటికంటే పెద్ద హక్కు ఓటు హక్కు రిజర్వేషన్ హక్కుతో పాటు ప్రశ్నించే హక్కు, ఆందోళన చేసే హక్కు దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించింది. అందువల్లే రాజ్యాంగాన్ని మారుస్తామంటూ బీజేపీ నేతలు చెబుతున్నారు. ఇది కచ్చితంగా ప్రజల హక్కులను లాక్కోవడమే అవుతుంది' అని ప్రియాంక విమర్శించారు. ప్రపంచంలోనే విలక్షణ వ్యక్తిత్వం కలిగిన మహాత్మాగాంధీ ఈ గుజరాత్ గడ్డపైనే పుట్టారని, సర్దార్ పటేల్, వీర్ రాంచోడ్ రబ్రి కూడా ఇక్కడే జన్మించారని గుర్తు చేశారు. ఆంగ్లేయుల నుంచి స్వాతంత్ర్యం కోసం ఎందరో గొప్ప వ్యక్తులు పోరాటం చేశారని, దేశ విముక్తి తర్వాత రాజ్యాంగాన్ని ప్రసాదించారని, రాజ్యాంగం గొప్పతనాన్ని అందరూ గుర్తించాలని కోరారు. మోదీ కుట్ర రాజకీయాలకు అంతిమ గడియలు దగ్గరపడ్డాయని ప్రియాంక హెచ్చరించారు. గురువారం గుజరాత్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ... కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకున్నారు. దేశ శత్రువులు భారత్‌లో బలహీన ప్రభుత్వం అధికారంలో ఉండాలని కోరుకుంటున్నందున... కాంగ్రెస్ పార్టీ 'యువరాజు'ను తదుపరి ప్రధానిగా చేయడంపై పాకిస్థాన్‌గా ఆసక్తిగా ఉందన్నారు.

జేఎంఎం-కాంగ్రెస్ అవినీతి కూటమి

మోదీ విమర్శ

రాంచి: జార్ఖండ్ అధికార కూటమి జేఎంఎం-కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ అవినీతి ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా జార్ఖండ్‌లో పర్యటిస్తున్న ఆయన అధికార కూటమిపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ దేశాన్ని పాలించిన రోజులను ప్రస్తావిస్తూ మోదీ తీవ్ర విమర్శలు చేశారు. ఉగ్రదాడుల తర్వాత ఏమీ చేయలేక, అంతర్జాతీయ వేదికలపై సహాయం కోసం అర్థించేదని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 'గతంలో ఉగ్రదాడుల తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని పిరికి ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై పెడబొబ్బలు పెట్టేది. కానీ ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ప్రస్తుతం సహాయం కోసం ఏడుస్తూ కేకలు పెడుతోంది. సర్జికల్ స్ట్రైక్స్‌తో అల్లాడిపోయిన పాక్... రాహుల్‌ను ప్రధాని కావాలని ప్రార్థిస్తోంది' అని ప్రధాని దుయ్యబట్టారు. అయితే బలమైన భారత్... అంతే బలమైన ప్రభుత్వాన్ని కోరుకుంటోందన్నారు. ఆ పార్టీల నేతలు తమ వారసుల కోసం భారీగా సంపదను కూడబెడుతున్నారని ఆరోపణలు చేశారు. 'నాకు సొంతంగా ఇల్లు, సైకిల్ కూడా లేదు. ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ఉన్న కాలంలో నాపై ఒక్క అవినీతి మచ్చా లేదు' అని అన్నారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ కేబినెట్‌లో మంత్రిగా పని చేసిన ఫవాద్ హుస్సేన్ ఇటీవల తన సోషల్ మీడియా ఖాతాలో రాహుల్ గురించి ఓ పోస్ట్ పెట్టారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత ప్రసంగించిన వీడియోను షేర్ చేసి... 'రాహుల్ ఆన్ ఫైర్' అని రాసుకొచ్చారు. దీనిపై ఇటీవల మోదీ మాట్లాడుతూ... 'దేశంలో కాంగ్రెస్ నానాటికీ బలహీన పడుతోంది. ఇక్కడ ఆ పార్టీ అస్తిత్వాన్ని కోల్పోతుంటే... అక్కడ పాకిస్థాన్ కన్నీళ్లు పెట్టుకుంటోంది. కాంగ్రెస్ యువరాజును (రాహుల్‌ను ఉద్దేశిస్తూ) భారత ప్రధానిని చేయాలని దాయాది దేశం తహతహలాడుతోంది. ఆ పార్టీ పాక్‌కు అభిమాని అని మనకు తెలుసు. ఇప్పుడు వారి మధ్య భాగస్వామ్యం బయటపడింది' అని దుయ్యబట్టారు.

ప్రజ్వల్‌పై సీబీఐ బ్లూ కార్నర్ నోటీసు?

లైంగిక కుంభకోణం కేసులో సిట్ వెల్లడి

బెంగళూరు : లైంగిక కుంభకోణంలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సీబీఐ 'బ్లూ కార్నర్ నోటీసు' జారీ చేసే అవకాశం ఉందని ఈ కేసును విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కార్యాలయాలు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు శనివారం సమాచారం అందించాయి. సిట్ అధికారులతో సిద్ధరామయ్య 'ముఖ్యమైన సమావేశం' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్వల్ రేవణ్ణను అరెస్టు చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'తగు చర్యలతో అరెస్టుకు ముందుకువెళతాం. సీబీఐ బ్లూ కార్నర్ నోటీసు జారీ చేసే అవకాశం ఉంది. దీంతో దర్యాప్తు వేగవంతం అవుతుంది' అని అధికారులు సీఎంకు తెలిపినట్లు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయాల నుంచి తమకు సమాచారం అందిన వెంటనే నిందితులను అరెస్టు చేసి వెనక్కి రప్పిస్తామని వారు (సిట్ అధికారులు) హామీ ఇచ్చారు. నేరానికి సంబంధించి ఒక వ్యక్తికి చెందిన గుర్తింపు, స్థానం లేదా కార్యకలాపాల గురించి దాని సభ్య దేశాల నుంచి అదనపు సమాచారాన్ని సేకరించడానికి అంతర్జాతీయ పోలీసు సహకార సంస్థ బ్లూ కార్నర్ నోటీసు జారీ చేస్తుంది. ప్రజ్వల్ రేవణ్ణపై బ్లూ కార్నర్ నోటీసును కోరుతూ భారతదేశంలో ఇంటర్‌పోల్ వ్యవహారాలకు నోడల్ బాడీ అయిన సీబీఐకి సిట్ అభ్యర్థన పంపినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. సీబీఐ ఈ నోటీసు జారీ చేయగానే ప్రజ్వల్ రేవణ్ణ ఆచూకీపై సమాచారం రావచ్చని సిట్ భావిస్తోంది. 33 ఏళ్ల ప్రజ్వల్ రేవణ్ణ... మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ మనవడు, ఏప్రిల్ 26న ఎన్నికలకు వెళ్లిన హసన్ నుంచి బీజేపీ-జేడీ(ఎస్) కూటమి అభ్యర్థిగా ఉన్నారు. ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన స్పష్టమైన వీడియో దృశ్యాలు గత కొన్ని రోజులుగా హసన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కుంభకోణంపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసింది. లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్ ముగిసిన మరుసటి రోజు ఏప్రిల్ 27న ప్రజ్వల్ రేవణ్ణ విదేశాలకు వెళ్లినట్లు సమాచారం. సిట్ ముందు హాజరు కావడానికి ప్రజ్వల్ తరఫు న్యాయవాది ఏడు రోజుల సమయం కావాలని కోరగా, అలాంటి నిబంధన లేనందున అది సాధ్యం కాదని దర్యాప్తు బృందం సమాధానం ఇచ్చింది. ఈ సమావేశంలో ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను సిట్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించినట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రజ్వల్ రేవణ్ణ కనిపించకుండా పోయాడని, అతనిపై లుకౌట్ నోటీసు జారీ చేశామని, గాలింపు చర్యలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని అధికారులు సిద్ధరామయ్యకు వివరించారు. తక్షణమే ప్రజ్వల్ రేవణ్ణను అరెస్టు చేయాలని, ఈ కేసులో ప్రమేయం ఉన్న వారిపై నిర్ణయాత్మక, కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించేది లేదని ముఖ్యమంత్రి అధికారులకు గట్టి ఆదేశాలు జారీ చేశారు.

రేవణ్ణపై సిట్ లుకౌట్ నోటీసులు

తన కుమారుడు, పార్టీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణతో పాటు లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న హోలెనరసిపూర్ జేడీ(ఎస్) ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లుకౌట్ నోటీసులు జారీ చేసిందని కర్నాటక హోం మంత్రి జి.పరమేశ్వర శనివారం తెలిపారు. జేడీ (ఎస్) ఎమ్మెల్యేపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ కేసును విచారిస్తున్న సిట్ ఎదుట విచారణకు హాజరుకావాలని రెండోసారి సమన్లు జారీ చేసిన మాజీ మంత్రి రేవణ్ణకు ఈ సాయంత్రం వరకు సమయం ఉందని పరమేశ్వర తెలిపారు. ఇప్పటికే రేవణ్ణపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశామని.. రేవణ్ణ కూడా విదేశాలకు వెళ్లే ఆలోచనలో ఉన్నారని, అది పూర్తయిందని పరమేశ్వర తెలిపారు. ప్రజ్వల్ విదేశాలకు వెళ్లాడు. ఇప్పటికే ప్రజ్వల్‌పై కూడా ఇదే తరహాలో లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా హోం మంత్రి పరమేశ్వర మాట్లాడుతూ సిట్ విచారణకు హాజరయ్యేందుకు రేవణ్ణకు ఈ సాయంత్రం వరకు సమయం ఉంది. ఆయనకు రెండోసారి నోటీసులు ఇచ్చాం. ఈలోగా మైసూరు కిడ్నాప్ కేసులో బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం' అని తెలిపారు.

చట్టసభల చరిత్రలో సీపీఐ రికార్డులే... రికార్డులు

భారత పార్లమెంటరీ చరిత్రలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అనేక రికార్డులను సృష్టించింది. అధికారమే పరమావధిగా ఆ పార్టీ ఎన్నడూ పనిచేయలేదు. ఆ పార్టీ నాయకులు, శ్రేణులు నిత్యం ప్రజలలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. దానితో ప్రజలు వారిని నెత్తినపెట్టుకుంటూ ఎన్నికల సమయంలో రికార్డులు సృష్టించేందుకు దోహదపడుతున్నారు. ఓట్లు, సీట్లు పరంగా సీపీఐ వెనుకంజలో ఉండవచ్చు...రికార్డుల పరంగా చూస్తే ఆ పార్టీ మిగిలిన పార్టీలకు అందనంత దూరంలో ఉందని చరిత్ర చెపుతోంది.

రిలయన్స్‌కు చుక్కలు చూపిన గురుదాస్

అవినీతి పరుల గుండెల్లో గునపం. అక్రమార్కులకు సింహస్వప్నం. నిర్భీతిగా...నిష్కర్షగా.. పార్లమెంటు వేదికగా పాలకులను ఎండగట్టిన యోధుడు. పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాలను కుదిపేసిన నాయకుడు. ఆయనే... సీపీఐ నేత గురుదాస్ దాస్ గుప్తా. దాదాపు పాతికేళ్ల పార్లమెంటరీ జీవితంలో పాలకుల అవినీతి, అక్రమాలపై అలుపెరగని పోరు సలిపిన ధీరోదాత్తుడే కాదు... ప్రజావ్యతిరేక చర్యల్ని నిశితంగా చర్చించి ప్రభుత్వాలను తూర్పారబట్టిన కృషీవలుడు. సభలో ఆయన నిలబడితే చాలు... ఏ కుంభ కోణంపై విరుచుకు పడతారో... ఏ విషయంపై విమర్శనాస్త్రాలను సంధిస్తారో...అని పాలక పక్షం గడగడలాడేందంటే అతిశయోక్తి కాదు. అమెరికాతో అణుడీల్ నుంచి... మతోన్మాదుల దాష్టీకాలను తునాతునకలుగా ఖండిరచిన సేనాని. 1992లో సెక్యూరిటీ కుంభకోణం... 2011లో 2 జీ స్కామ్... రిలయన్స్ అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చి... ఆర్థిక కుంభకోణాలపై అలు పెరగని పోరాటం చేశారు. ఘన విజయం సాధించి ప్రజాపక్షాన నిలిచారు. ఒక పెద్ద కంపెనీ చేసిన మోసాన్ని వెలుగులోకి తీసుకువచ్చి నందుకు ఆదాయ పన్ను శాఖ దాస్‌గుప్తాకు రూ.7.5 లక్ష లను బహుమతిగా ఇచ్చింది. అయితే ఈ మొత్తాన్ని పంజాబ్‌లో ఖలిస్థాన్ టెర్రరిజానికి బల్కెపోయిన వారి పిల్లల కోసం ఖర్చు చేయవలసిందిగా కోరుతూ మహిళా సమాఖ్య ఆ రాష్ట్ర సమితికి అందజేశారు

మొదటి ఎన్నికల్లో అత్యధిక ఓట్లు, మెజారిటీ కమ్యూనిస్టులకే

ఎక్కువ ఓట్లు పొందిన మొదటి మహిళా ఎంపీ సీపీఐ నేతే

పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో స్మారకోపన్యాసం ఘనత సీపీఐకే

1952లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో అత్యధిక ఓట్లు, మెజారిటీ సాధించిందీ భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులే. మొట్టమొదటి లోక్‌సభలో అతి పిన్నవయస్కుడు కూడా సీపీఐ సభ్యుడే. పార్లమెంట్ తొలి సమావేశాలు 1952 ఏప్రిల్ 17న ప్రారంభమయ్యాయి. అప్పుడు పార్లమెంట్ హాల్‌లోకి మొట్టమొదట అడుగుపెట్టిన వ్యక్తి సీపీఐ సభ్యుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి.

పిల్లలమర్రి వెంకటేశ్వర్లు

దేశంలో అత్యధిక సార్లు లోక్‌సభకు ఎన్నికైన ఏకైక నేతగా రికార్డు సృష్టించింది సీపీఐ నాయకుడే. ఉత్తమ పార్లమెంటేరియన్‌కు ఇచ్చే గోవింద్ వల్లభ్ పంత్ అవార్డు మొట్టమొదట అందుకున్నదీ సీపీఐ ఎంపీనే. 1962లో అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి, దేశంలోనే ఎక్కువ ఓట్లు పొందిన మహిళా అభ్యర్థి సీపీఐ నేతే. మహిళా రిజర్వేషన్లకు ఆద్యురాలైన గీతాముఖర్జీ కూడా సీపీఐ ఎంపీనే. తమ వాగ్ధాటి ద్వారా ప్రభుత్వాధినేతలను గడగడలాడించిన వారిలో అగ్రగణ్యులు సీపీఐ ఎంపీలే. అప్పటి ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ చేత పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించిన సివంగి సీపీఐ సభ్యురాలే. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో స్మారకోపన్యాసం నిర్వహించిన ఘనత కూడా సీపీఐ పార్లమెంట్ సభ్యునికే దక్కింది. రాజ్యసభ ఏర్పడినప్పటి నుంచి 1981 ఆగస్టులో మరణించే వరకు ఆ సభ సభ్యుడిగా ఉన్న ఏకైక వ్యక్తి కూడా సీపీఐ నాయకుడే. పార్లమెంట్‌లోనే కాదు అసెంబ్లీ ఎన్నికలలోనూ సీపీఐ సభ్యులకు ఉన్నని రికార్డులు ఇతర పార్టీల అభ్యర్థులకు ఉండవంటే అతిశయోక్తికాదు. డిపాజిట్ రాకపోయినా ఎమ్మెల్యేగా ఎన్నికైందీ సీపీఐ ప్రజాప్రతినిదే. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో మాజీ ప్రధాన మంత్రి లాల్ బహుదూర్ శాస్త్రీని ఓడించిన చరిత్ర సీపీఐకి ఉంది. 1967లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నాటి ముఖ్యమంత్రి గియాని గురుముఖ్ సింగ్ ముసాఫిర్‌ని ఓడించిందీ సీపీఐ నాయకుడే.

పార్లమెంట్ తొలి సమావేశాలు 1952 ఏప్రిల్ 17న ప్రారంభమయ్యాయి. అప్పుడు పార్లమెంట్ హాల్‌లోకి మొట్టమొదట అడుగుపెట్టిన వ్యక్తి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కాదు...సర్దార్ పటేల్ కాదు. పార్లమెంట్ హాల్‌లో మొదటి కాలు మోపిన వ్యక్తి సీపీఐ సభ్యుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి. తొలి లోక్‌సభకు ఎన్నికైన వారందరి కన్నా ఎక్కువ ఓట్లు సంపాదించినందుకు ఆయనకు ఆ గౌరవం లభించింది. పార్లమెంట్ ఎన్నికలలో దేశంలో అందరు ఎంపీలకన్నా ఆ మాటకొస్తే జవహర్‌లాల్ నెహ్రూ కన్నా ఎక్కువ ఓట్లు లభించినందుకు రావినారాయణరెడ్డికి పార్లమెంట్‌లో మొదటి అడుగుమోపే అవకాశం లభించింది. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్‌పై పోటీచేసి నెహ్రూకన్నా అధిక ఓట్లతో గెలిచి, పార్లమెంటరీ రాజకీయ రంగంలో చరిత్ర సృష్టించిన ఖ్యాతి ఆయనకే దక్కింది. ఆ ఎన్నికలలో ఈ నియోజకవర్గం ద్విసభ్య నియోజకవర్గంగా ఉంది. ఇక్కడి నుంచి పోటీచేసిన పీడీఎఫ్ (అప్పుడు సీపీఐపై నిషేధం ఉండడంతో పీడీఎఫ్ పేరుతో పోటీచేశారు.) అభ్యర్థులు ఇద్దరూ రావి నారాయణరెడ్డి, సుకం అచ్చాలు దేశంలోనే అత్యధిక ఓట్లు, మెజారిటీ సాధించారు. ఈ ఎన్నికలలో రావి నారాయణరెడ్డికి 3,09,162 ఓట్లు లభించగా, ఆయన ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి పి. మహేంద్రనాథ్ కేవలం 96,837 ఓట్లు మాత్రమే తెచ్చుకున్నారు. రెండో నియోజకవర్గం నుంచి పోటీచేసిన అచ్చాలుకు 2,82,117 ఓట్లు రాగా, సమీప కాంగ్రెస్ ప్రత్యర్థికి 86,882 ఓట్లు లభించాయి. ఈ ఎన్నికలలో రావి నారాయణరెడ్డికి 2,12,325 ఓట్ల మెజారిటీరాగా, అచ్చాలుకు 1,95,235 ఓట్ల మెజారిటీ వచ్చింది.

దేశంలో కమ్యూనిస్టు, మహిళా ఉద్యమాలపై తనదైన ముద్ర వేసిన రేణు చక్రవర్తి పాతతరం కమ్యూనిస్టు యోధుల్లో ఒకరు. సమర్థమంతమైన నిర్వాహకురాలు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపించిన నేత ఆమె. 1952లో పశ్చిమ బెంగాల్‌లోని బసిర్హాట్ లోక్‌సభా స్థానం నుంచి పోటీచేసి విజయం సాధించి పశ్చిమ బెంగాల్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఏకైక మహిళా సభ్యురాలిగా నిలిచారు. 1962లో బారక్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఆ ఎన్నికలో దేశవ్యాప్తంగా అత్యధిక ఓట్లు, మెజారిటీ సాధించిన వ్యక్తిగా రేణూ చక్రవర్తి నిలిచారు.

కమ్యూనిస్టు ఉద్యమ మహానేత, నిబద్ధతగల ప్రజా సేవకుడు, ప్రపంచ కార్మికసంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు, కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి ఇంద్రజిత్ గుప్తా పార్లమెంట్ సభ్యునిగా అనేక రికార్డులు సృష్టించారు. ఆయన రికార్డులు చెరగనివిగా ఉన్నాయి. ఆ రికార్డు బద్దలు కొట్టడం సమీప భవిష్యత్తులో అసాధ్యం. దేశంలో అత్యధిక సార్లు లోక్‌సభకు ఎన్నికైన ఏకైక నేతగా ఆయన రికార్డు సృష్టించారు. 1977 నుంచి 1980 మధ్య కాలం మినహా 1960 నుంచి 2001 ఫిబ్రవరి 20న తుది శ్వాస విడిచే వరకు ఇంద్రజిత్ గుప్తా లోక్‌సభ సభ్యునిగానే ఉన్నారు. ఆయన మొత్తం 37 సంవత్సరాలపాటు లోక్‌సభ సభ్యునిగా పనిచేశారు. అత్యుత్తమ పార్లమెంట్ సభ్యులకిచ్చే అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు'ను 1992లో ఇంద్రజిత్ గుప్తా అందుకున్నారు.

ఈ అవార్డును అందుకున్న మొట్టమొదటి పార్లమెంట్ సభ్యుడు ఆయనే. 'సభా పితామహుడు'గా ఇంద్రజిత్‌గుప్తా పేరుపొందారు. 11, 12,13 లోక్‌సభలకు ఆయన ప్రొటెమ్ స్పీకర్‌గా వ్యవహరించారు. దేశంలో పార్లమెంటరీ కమిటీ వ్యవస్థ బలోపేతానికి ఇంద్రజిత్ గుప్తా పార్లమెంట్ సభ్యునిగా తన అనుభవాన్ని ఉపయోగించారు. సభా నిబంధనలు, నియమాలు, విధానాలపై పూర్తి అవగాహన ఉన్న నిష్ణాతుడు ఇంద్రజిత్‌గుప్తా. తన ప్రభావవంతమైన, బలమైన వాదనలు, సమయానికి తగ్గ అంశాలపై చర్చలో తన అసాధారణమైన వాగ్ధాటితో సభా దృష్టిని ఆకర్షించేవారు. అనేక సభా కమిటీలకు చైర్మన్‌గా, సభ్యుడిగా పనిచేశారు.

చలించని భూపేశ్ కంఠ ధ్వని

భూపేశ్ గుప్తా. ఈ పేరు వింటేనే భారత పార్లమెంటు ప్రధానంగా రాజ్యసభ చరిత్ర కళ్ల ముందు మెదలాడుతుంది. రాజ్యసభ ఏర్పడినప్పటి నుంచి 1981 ఆగస్టు ఆరున మాస్కోలో మరణించేదాకా ఆ సభ సభ్యుడిగా ఉన్న ఏకైక వ్యక్తి ఆయనే. రాజ్యసభలో భూపేశ్ ఒక సంచలనం. ఆయనది ఎవరికీ లొంగే మనస్తత్వం కాదు. ఆయన రాజ్యసభలో ఉన్నన్నాళ్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఎవరికీ లొంగని భూపేశ్ అన్న విశేషణం లేకుండా రాసేదే కాదు. 1952 ఏప్రిల్ మూడవ తేదీన ఆయన మొదటి సారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాజ్యసభ మొదటి సమావేశం 1952 మే 13 న ప్రారంభమైంది. ఆ తరవాత వరసగా 1958, 1964, 1970, 1976 లో రాజ్యసభకు ఎన్నికవుతూనే వచ్చారు. రాజ్యసభలో ఆయనది మహామూర్తిమత్వం. భూపేశ్ రాజ్యసభలో చాలా సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారు. భూపేశ్‌గుప్తా మాట్లాడుతున్నారంటే పార్లమెంటు ఆవరణలో ఎక్కడ ఉన్నా నెహ్రూ సభలోకి పరుగెత్తుకొచ్చే వారు. ఆయనంటే అంత ఆదరణ ఉండేది. నిర్భయంగా, ముక్కుకు సూటిగా మెదలడం ఆయన తత్వం. అటల్ బిహారీ వాజపేయి రాజ్యసభ సభ్యుడిగానే కాక జనతా పార్టీ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడూ సభలోకి ప్రవేశించగానే భూపేశ్ కూర్చున్న చోటికి వెళ్లి నమస్కరించిన తరవాత కానీ తాను ఆశీనులయ్యేవారు కాదు. ఇందిరాగాంధీతో సాన్ని హిత్యం ఉన్నా రాజకీయాల దగ్గరకొచ్చే సరికి భూపేశ్ ఏ మాత్రం రాజీపడేవారు కాదు.

ఏ ఎంపీకి దక్కని గౌరవం హీరేన్ ముఖర్జీకి



బక్క పలచగా ఉండే హీరేన్ ముఖర్జీ చాలా సాత్వికుడిలా కనిపిస్తారు. కానీ పార్లమెంటులో నోరు తెరిస్తే అందరూ అవాక్కై పోవాల్సిందే. మనిషి పీలగా ఉన్నా గొంతు ఘనమైందే. ఇంగ్లీషు ఉచ్చారణ పూర్తిగా ఆక్స్‌ఫర్డ్‌దే. పలుకుబడి పూర్తిగా కలకత్తాదే. స్వరం మాత్రం అచ్చమైన బెంగాలీదే. ఆయన ఎప్పుడు మాట్లాడినా పాండిత్యం జాలువారేది. ఆయన ప్రసంగిస్తుంటే గ్రంథాలయం మొత్తం ముక్త కంఠంతో మాట్లాడుతున్నట్టు ఉండేది. 1952 లో మొట్ట మొదటి సారి ఈశాన్య కలకత్తా నియోజకవర్గం నుంచి ఎన్నికై లోక్‌సభలో అడుగు మోపి వరసగా 1957, 1962, 1967, 1971లోనూ విజయం సాధించారు. హిరేన్ ముఖర్జీ గౌరవార్థం పార్లమెంటులో ఏటా హిరేన్ ముఖర్జీ స్మారకోపన్యాసం ఏర్పాటు చేస్తారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో జరిగే సమావేశంలో నోబెల్ బహుమతి గ్రహీతలు అమర్త్య సేన్, మహమ్మద్ యూనస్, ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త జగదీశ్ భగవతి, బూటాన్ ప్రధాని ల్యోంచెన్ జిగ్మి వై. తిన్లే లాంటి వారు స్మారకోపన్యాసాలు చేశారు. మరే పార్లమెంటు సభ్యుడికీ ఈ గౌరవం దక్కలేదు. 1952 నుంచి 1964 దాకా లోకసభలో సీపీఐ ఉప నాయకుడిగా, ఆ తరవాత 1962 నుంచి 1967 దాకా సీపీఐ పక్ష నాయకుడిగా ఉన్నారు. పార్లమెంటు గ్రంథాలయానికి, బ్యూరో ఆఫ్ పార్లమెంటరీ స్టడీస్ కు గౌరవ సలహాదారుగా ఉన్నారు. 1978 నుంచి 82 దాకా లోకసభ స్పీకర్ కు గౌరవ సలహాదారుగా ఉన్నారు.

మొరార్జీతో క్షమాపణ చెప్పించిన సివంగి

మహిళా హక్కుల, కార్మిక ఉద్యమ నేత ప్రముఖ కమ్యూనిస్టు పార్వతీ కృష్ణన్ జీవితం నేటి తరానికి ఆదర్శనీయం. ఆమె కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి సీపీఐ తరపున మూడు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాజ్యసభ సభ్యురాలిగా కూడా పనిచేశారు. మహిళలపై కాల్పులు జరిపినందుకు పార్లమెంటులో ప్రధాని మొరార్జీ దేశాయ్ క్షమాపణలు చెప్పేలా చేసిన సివంగి ఆమె. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం అవిశ్రాంత పోరాటం చేశారు.

27 ఏళ్లకే ఎంపీ... కానేటి మోహన రావు

మొట్టమొదటి లోక్‌సభకు ఎన్నికైన సభ్యులలో అతి పిన్న వయస్కుడు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కానేటి మోహనరావు. 1952లో రాజమండ్రి లోకసభ ద్విసభ్య నియోజకవర్గం నుండి మొదటి లోక్‌సభకు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. మొదటి లోకసభ సభ్యుడయ్యే నాటికి ఆయనకు 27 ఏళ్లే. అప్పుడు రాజమండ్రి ద్విసభ్య నియోజకవర్గం. జనరల్ సీటు నుంచి పోటీ చేసిన దుర్గాబాయి దేశ్ ముఖ్ సోషలిస్టు అయిన నల్లారెడ్డి చేతిలో ఓడిపోయారు. కానేటి మోహన రావు కాంగ్రెస్ అభ్యర్థి పి.గోపాల కృష్ణను ఓడించారు. అంబేద్కర్‌తో కలిసి పార్లమెంటులో కూర్చోగలిగినందుకు మోహన రావు చాలా సంతోషపడేవారు. పార్లమెంటు ఏర్పడి 60 సంవత్సరాలైన సందర్భంగా 2012లో ఉత్సవాలు నిర్వహించినప్పుడు అప్పటికి బతికి ఉన్న మొదటి పార్లమెంటు సభ్యులను కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. కానీ కానేటి మోహన రావు ఆ రోజుకు సజీవంగా ఉన్నాడని తెలియనందువల్ల ఆయనకు ఏ ఆహ్వానమూ అందలేదు. ఒక దినపత్రికలో ఆయన ఇంకా సజీవులేనని వార్త వస్తే హడావుడిగా ఆయనను దిల్లీ తీసుకెళ్లి సన్మానించారు.

ఎంపీ భద్రం

కోస్తా ఆంధ్ర ప్రాంతం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగంగా ఉన్నప్పటి నుంచి, 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు, ఆ తరవాత ఆంధ్రప్రదేశ్ లోనూ పిల్లలమర్రి కమ్యూనిస్టు పార్టీ తరఫున శాసనసభ్యుడిగా పని చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు రాజాజీ ముఖ్యమంత్రి. అప్పుడు తెలుగు వారి తరఫున ఎన్నికైన ఏకైక కమ్యూనిస్టు సభ్యుడు పిల్లమర్రే. అయినా శాసనసభలో రాజాజీని గడగడలాడించే వారు. ఒక సారి "ఆ నల్ల కళ్లజోళ్లు తీసి చూడండి" అని నిలదీయగలిగారు. 1952 ఎన్నికలలో పిల్లలమర్రి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా జగ్గయ్యపేట నుంచి శాసనసభ్యుడయ్యారు. ఆయన 50 సంవత్సరాల రాజకీయ జీవితంలో 20 ఏళ్ల పైన శాసనసభలో గడిచింది. శాసనసభ్యుడిగా ఉన్నంత కాలం పిల్లలమర్రి ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ, ఆ ఉద్యమాలను అసెంబ్లీలో లేవనెత్తే వారు. పెద్దగా చదువుకోక పోయినా పార్టీ సాహిత్యం చదవడం, ఇతర పార్టీలను గురించి కూడా అధ్యయనం చేయడంవల్ల శాసనసభలో రాణించారు.

1957 ఎన్నికలలో ఉత్తరప్రదేశ్‌లోని కొలస్లాహ్ అసెంబ్లీ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి ఉదల్ తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి లాల్ బహదూర్ శాస్త్రీని 2,266 ఓట్ల తేడాతో ఓడించారు. 1985 లో మినహా 1993 అసెంబ్లీ ఎన్నికల వరకు ఉదల్ కొలస్లాహ్ శాసనసభ నియోజకవర్గం నుంచి గెలుస్తూనే ఉన్నారు. 1967లో పంజాబ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో అమృతసర్ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీచేసిన సత్యపాల్ డాంగ్ ముఖ్యమంత్రి గియాని గుర్‌ముఖ్ సింగ్ ముసాఫిర్‌పై ఘన విజయం సాధించారు.

స్వాతంత్య్రం అనంతరం మొదటిసారి 1952లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా పరవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొన్నది. డిపాజిట్ పొందేందుకు రావలసినన్ని ఓట్లు ఆ ఎన్నికలలో ఏ అభ్యర్థికి రాలేదు. అయినప్పటికీ సీపీఐ అభ్యర్థి ఎంవీ భద్రం ఎమ్మెల్యే పదవి పొంది రికార్డు సృష్టించారు. ఈ నియోజకవర్గం నుంచి తొమ్మిది మంది పోటీ చేశారు.

నియోజకవర్గంలో మొత్తం 60,780 ఓట్లు ఉంటే 25,511 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. సీపీఐ అభ్యర్థి ఎంవీ భద్రంకు 7,064 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థి జగన్నాథరాజుకు 4,347 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి ఎల్‌జీపీ రావుకు 3,109, కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థి ఈటి నాగయ్యకు 1,158 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో డిపాజిట్ దక్కాలంటే పోలైన ఓట్లలో మూడో వంతు అంటే 8,504 ఓట్లు రావాలి. పోటీచేసిన ఎవరికీ అన్ని ఓట్లు రాకపోవడంతో ప్రత్యర్థిపై ఒక్క ఓటు అదనంగా వచ్చినా విజేతనని కమ్యూనిస్టులు పట్టుపట్టడంతో ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు భద్రంను విజేతగా ప్రకటించారు.

- మోదుమూడి మురళీకృష్ణ

సమరాంగణం 2024

ఓటరు దేవుడా మేలుకో

ఓటరు దేవుడా మేలుకో
ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు!!

చూడు తరుముకొస్తోంది మోదీ రథం
దాని చక్రాల కింద నిన్ను తొక్కేందుకు
ఉరుముతోంది విద్వేషం
దాని విషాగ్నితో నిన్ను మరిగించేందుకు

ఓటరు దేవుడా మేలుకో
ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు!!

దూసుకొస్తోంది మోదీ రథం
మాయా లోకం సృష్టించేందుకు
నిన్ను మళ్లీ మభ్యపెట్టేందుకు
నీతో బంధాలు కలిపేందుకు
నిన్ను కాల రాసేందుకు
నిలువనీడ లేకుండా చేసేందుకు

ఓటరు దేవుడా మేలుకో
ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు!!

చూడు ఉరుముతోంది కాషాయం
అంధభక్తులతో లోకాన్ని అంధకారం చేసేందుకు
గాంధీ రూపంతో గాడ్సే పనులు చేసేందుకు
వికాసం అంటూ వినాశనం సృష్టించేందుకు

ఓటరు దేవుడా మేలుకో
ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు!!

తరుముతోంది మోదీ రథం
నిన్ను నట్టేట ముంచేందుకు
ప్రజాస్వామ్యాన్ని హరించేందుకు
లౌకికవాదాన్ని మరిపించేందుకు
నిరంకుశత్వాన్ని స్థాపించేందుకు
నియంతలా నిన్ను ఏలేందుకు

ఓటరు దేవుడా మేలుకో
ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు!!

తరుముతోంది మోదీ రథం
కమలం తీరు తెలిపేందుకు
నిన్ను గాఢ నిద్ర నుంచి మేలుకొల్పేందుకు

ఓటరు దేవుడా మేలుకో
ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు!!

చూడు ముగిశాయి రెండుదశలు
వచ్చేస్తోంది మూడవ దశ
ఆలోచించి ఓటు వేయమని చెప్పేందుకు
ఓటు బలాన్ని తెలియజేసేందుకు
భాయి భాయి సంస్కృతిని కాపాడుకునేందుకు
దేశాన్ని కాపాడే చివరి అవకాశం ఇచ్చేందుకు
ఇంకా సమయం లేదని చెప్పేందుకు

ఓటరు దేవుడా మేలుకో
ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు!!

- షాయిస్తా ఖానూమ్ పఠాన్



ధన ప్రవాహం

- తిరుపతిలో ప్రధాన అభ్యర్థుల ప్రచార ఖర్చు రూ.100 కోట్లకుపైనే
- రోజువారీ ప్రచార వ్యయం రూ.30 వేలుపైనే
- ప్రచారంలో దూసుకుపోతున్న ఇండియా అభ్యర్థి మురళి

శాసనసభా ఎన్నికల్లో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీల ప్రచారంలో డబ్బు నీళ్లలా ఖర్చుచేస్తున్నాయి.అభ్యర్థులకు కూడా కేవలం డబ్బే కొలబద్ధగా మారింది. గతంలో డబ్బుతో పాటు సామాజిక వర్గం, పలుకుబడి, గుణ గుణాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసేవారు కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరించారు. రాష్ట్రంలోనే తిరుపతి శాసనసభకు అభ్యర్థుల ఎంపిక విషయంలో కొన్ని పార్టీలు కీలకంగా భావించేవి. నూతన పార్టీల ఆవిర్భవం కూడా తిరుపతి నుంచి జరిగేది. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీ రామారావు 1983లో, ప్రజారాజ్యం వ్యవస్థాపకుడు చిరంజీవి 2009లో తిరుపతి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం తిరుపతి నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా 46 మంది నామినేషన్ వేశారు. వీరిలో 15 మంది గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు కాగా మరో 30 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. అయితే స్వతంత్ర అభ్యర్థులను రెండు ప్రధాన పార్టీలు తమ అవసరాల నిమిత్తమే రంగంలోకి దింపాయన్న అనుమానాలున్నాయి. ప్రతి అభ్యర్థికి బూత్ ఏజెంట్లను పెట్టుకోవడానికి, పోలింగ్ రోజున నియోజకవర్గ బూత్‌ల పరిశీలనకు, కౌంటింగ్ సరళి అంచనాకు వినియోగించుకోవచ్చు. నామినేషన్ రోజు నుంచి రెండు పార్టీల అభ్యర్థులు ప్రతి డివిజన్‌లో కనీసం 300 మంది చొప్పున 15వేల మంది అంటే నగరంలో 3,000 మంది రోజువారీ ప్రచారంలో ఉన్నారు. వీరు తమ పార్టీ జెండా భుజాన వేసుకుని వీధుల్లో తిరుగుతూ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. పాఠశాలలకు సెలవులు కావడంతో చిన్నపిల్లలను, విద్యార్థులను, వయోవృద్ధులనూ ప్రచారానికి వినియోగిస్తున్నారు. వీరిని ఒకచోట గుమ్మిగూడించి హాజరుపట్టిని గ్రూపు లీడర్ నిర్వహించడం రోజూ ఉదయం, సాయంత్రం జరుగుతోంది. మండుటెండల్లో సైతం ప్రచారానికి వినియోగించుకున్న వీరికి రోజుకు రూ.400, తాగునీరు, మజ్జిగ సరఫరా చేస్తున్నారు. వార్డు ఇన్‌చార్జీల సహాయంతో వీరిని సమన్వయం చేసుకొని రోజు 7వేల నుండి 10 వేల మంది ఓటర్లను కలసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంచుతున్నారు. ఇంటింటి ప్రచారానికి ఒక్కో పార్టీ రోజుకు కోటి రూపాయులకు పైగా ఖర్చు చేస్తున్నది. ఇద్దరు అభ్యర్థులు తమ ప్రచారానికి, ప్రత్యర్థిని ఎత్తి పొడిచేందుకు చెరొక చిన్న పత్రికను అరువుకు తీసుకొని డబ్బా కొట్టుకుంటున్నారు. తొలుత వారపత్రిక ప్రారంభించి ఎన్నికలు సమీపించే నాటికి దినపత్రికగా మార్పు చేశారు. ప్రతి రోజూ ఎక్కువ సంఖ్యలో ముద్రించి ప్రతి ఇంటికి చేరవేస్తున్నారు. అభ్యర్థులు ఇద్దరు స్థానికత అంశంపైన పోటాపోటీగా విమర్శలు గుప్పిస్తున్నారు. నీది పక్క జిల్లా అంటే... నీ మూలాలు సైతం గతంలో పక్కన ఉన్న ఫ్యాక్షన్ జిల్లావి కాదా... అంటూ పరస్పరం విమర్శించుకుంటున్నారు.

నగరాభివృద్ధికి రోడ్ల విస్తరణకు పాటుపడ్డానని చెపుతుంటే కేవలం తన సొంత భూములు ధరల పెంపు కోసమే అంటూ ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగిస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా విభజనలు చేయడం, నగర కార్పొరేటర్లను ప్రలోభపెట్టడమే కాకుండా నామినేటెడ్ పదవుల ఆశ చూపి తమ వైపుకు తిప్పుకుంటున్నారు. టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన వరాలు ప్రతిపక్షాల ఫిర్యాదు మేరకే ఆగిపోయాయని సానుభూతి పొందేందుకు ఒకరు ప్రయత్నిస్తుంటే... ఎన్నికల సమయంలో ఇలాంటివి చేపట్టితే ఎన్నికల కమిషన్ చూస్తూ ఊరుకుంటుందా అని మరొకరు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పథకాల గురించి అధికార పక్ష అభ్యర్థి ప్రచారం చేస్తుంటే... విద్యుత్ చార్జీల పెంపు, ఆస్తి పన్ను, చెత్త పన్ను వంటివి ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాన్ని ప్రత్యర్థి చేస్తున్నారు. రెండు ప్రధాన పార్టీలు ఈసారి రూ.100 కోట్లకుపైగా ఖర్చుకు సిద్ధమయ్యారు.

తిరుపతిలో ఎన్నికల సందర్భంగా గొడవలు సృష్టించి విద్యావంతులను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు స్వతంత్ర అభ్యర్థులను నిలబెట్టారన్న అభిప్రాయం ఉన్నది. దీనిపై ఎన్నికల సంఘం... తిరుపతితో పాటు రాష్ట్రంలోని 14 నియోజకవర్గాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. తిరుపతి అభ్యర్థుల రోజువారీ ఖర్చుపై నిఘా పెంచడం వల్ల ప్రధాన అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించే అవకాశం లేకపోలేదు. ప్రజల కోసం పోరాడే వామపక్ష అభ్యర్థుల వైపు తిరుపతి ప్రజలు మొగ్గు చూపుతున్నారు. 80శాతానికిపైగా విద్యావంతులు ఉండగా వారు విజ్ఞతతో ఓటేస్తారు. రౌడీయిజం, అసాంఘీక కార్యకలాపాలు పాల్పడేవారికి ఓటుతో బుద్ధి చెప్పగలుగుతారు.

సామాన్యులను ఆకట్టుకునే ప్రయత్నంలో సీపీఐ

ఇండియా కూటమి అభ్యర్థిగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి బరిలో నిలిచారు. ప్రచారంలో దూసుకెళుతున్నారు. ధన రాజకీయాలను ఎండగట్టుతూ ఎన్డీయే కూటమి అభ్యర్థికి, అధికార పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా సామన్యులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. పేదల కోసం సీపీఐ అధ్వర్యంలో 24 కాలనీలు నిర్మించడం, కార్మిక సమస్యలపై పోరాటాలు, రోజువారీ ప్రజా సమస్యలపై ఉద్యమాల గురించి కరపత్రాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. ప్రత్యేక హోదా, రాజధాని, రాయలసీమ ప్యాకేజీ, టీటీడీ నిధులు, 10 శాతం విద్య, వైద్యం ఖర్చు, తిరుపతి శాంతి భద్రతల పరిరక్షణ, తాగునీరు, డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని, తనకు అవకాశం ఇవ్వాలని నగర ప్రజలను కోరుతున్నారు.

- తూపల్లె జనార్ధన్

ధర్మవరం నేతన్న గెలిచేదెప్పుడు?

- చేనేతలను పట్టించుకోని పాలకులు
- నేటికీ అపరిష్కృతంగానే సమస్యలు
- నియోజకవర్గాన్ని వెంటాడుతున్న తాగు-సాగునీటి కష్టాలు
- తాజా ఎన్నికల్లో అభ్యర్థుల భవితను నిర్ణయించేది నేతన్నలే...

ఆంధ్రప్రదేశ్, శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం ప్రత్యేకం. ధర్మవరం సిల్కు చీరలకు మంచిపేరున్నది. అయోధ్యలో రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ధర్మవరం నుంచి చీరలు వెళ్లడం విశేషం. అయితే ఈ నియోజకవర్గంలో చేనేతలు, రైతులు ఎక్కువ. కుల వృత్తులు వీడి వలస బాట పట్టి కార్మికులుగా మారుతున్న పరిస్థితి ఆందోళనకరం. దశాబ్దాలుగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని నేతన్నలు వాపోతున్నారు. నేటికీ న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. నాయకుల దృష్టి తమ వైపుకు మళ్లే రోజు కోసం వేచివున్నారు. వారి కష్టాలు తీరే క్షణం కోసం నిరీక్షిస్తున్నారు. తమకు వారసత్వంగా అందిన కళా సంపద పరిరక్షణ కోసం పరితపిస్తున్నారు. ఇందుకోసం నాయకుల సహాయ, సహకారాలను కోరుతున్నారు. ఈ ప్రాంతం తోలుబొమ్మలాటకు కూడా ప్రసిద్ధి. సంపానీ, మయూరా, పదరావిందం చీరలకు ధర్మవరం పేరుగాంచింది. ఈ నియోజకవర్గంలో ధర్మవరం, బతాలపల్లె, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలు ఉన్నాయి.

ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం 1951లో ఏర్పాటైంది. ఇది హిందూపూర్ పార్లమెంటు స్థానం పరిధిలోకి వస్తుంది. 1952లో ఈ స్థానానికి తొలిసారి ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి మొత్తం 15సార్లు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ ఆరు సార్లు చొప్పున గెలుపొందాయి. వైసీపీ, కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ ఒక్కోసారి గెలిచాయి. ఒకమారు స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ఎప్పుడు కూడా ఏ పార్టీ నుంచి నేతన్న పోటీ చేసిన దాఖలాలు లేవు. అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించగల ఈ వర్గం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతుండటం బాధాకరం. అభ్యర్థి రాజకీయ ఉద్దండుడైనా... కొత్త వారైనా చేనేత వర్గం సమానంగా ఆదరించింది. అయితే ఎవరు ఎన్నికైనా చేనేతల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు.

తాజా ఎన్నికల్లో వైసీపీ తరపున కేతిరెడ్డి వెంటకరామి రెడ్డి, కాంగ్రెస్ తరపున రంగన అశ్వర్థ నారాయణ, బీజేపీ తరపున యాదవ వర్గానికి చెందిన వై.సత్యకుమార్ పోటీ చేస్తున్నారు. వరుసగా రెండోసారి ఈ స్థానం నుంచి గెలవాలని వైసీపీ భావిస్తుండగా, ఎన్డీయే కూటమిలో భాగంగా టీడీపీ ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించింది. దీంతో నియోజకవర్గంలో టీడీపీ రెండుగా చీలిపోయింది. ఫలితంగా బీజేపీ అభ్యర్థి గెలుపునకు టీడీపీ పూర్తిగా సహకరించే అవకాశం లేదు.

'ఎవరు ఎన్నికైనాగానీ మా బతుకులు మారడంలేదు. సంప్రదాయ పద్ధతుల్లో బట్టలు నేసే మాకు పవర్‌లూమ్‌లతో ముప్పు పొంచివుంది. దీని కారణంగా వారసత్వ కళలకు దూరమవుతూ వలస కార్మికులుగా మిగిలిపోతున్నారు. ధర్మవరంలో సంప్రదాయ బద్ధంగా జరిగే మగ్గం పనికి భద్రత కల్పించేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పాలకులను కోరుతున్నాం' అని చేనేత దుకాణదారుడు వెంకటేశ్ అన్నారు.

నేతన్నల వలే స్థానిక రైతుల సమస్యలు కూడా పరిష్కారం కావడంలేదు. అన్ని మండలాల్లో తాగు-సాగు నీటి సమస్య ఉంది. తాగు-సాగు నీటి అవసరాలను తీర్చుకునేందుకు చాలా దూరం వెళ్లాల్సి వస్తోందని తాడిమర్రి మండలంలోని కునుకుంట్ల గ్రామానికి చెందిన యెల్లప్ప అన్నారు. ఈ సమస్య ఒక్క గ్రామానికే పరిమితం కాదని, మొత్తం నియోజవర్గంలో ఇదే పరిస్థితి ఉన్నదని చెప్పారు. పని లేక వలసలు తప్పడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే భూకబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు.

ధర్మవరం నియోజకవర్గం 1,33,361 హెక్టార్లలో విస్తరించి ఉండగా ఇక్కడి జనాభా మొత్తం 3,04,706.

కాగా, తొలి ఎన్నికల్లో ధర్మవరం నుంచి శ్రీనివాసులు కాసెట్టి (కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ) ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1955 ఎన్నికలలో ఈ స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది. అప్పటి నుంచి 1983 వరకు కాంగ్రెస్ ప్రాతినిధ్యం కొనసాగింది. ఆ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లోకి టీడీపీ వచ్చింది. 2004 వరకు టీడీపీ ఈ స్థానాన్ని ఏలింది. టీడీపీ తరపున మొదటిసారి ఎన్నికైన జి.నాగిరెడ్డి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యే అయ్యారు. టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగానూ పనిచేశారు. 2009లో టీడీపీ ఆధిపత్యానికి చెక్ పెడుతూ కాంగ్రెస్ తరపున ధర్మవరం ఎమ్మెల్యేగా కేతిరెడ్డి వెంకటరామి రెడ్డి గెలుపొందారు. 2014 ఎన్నికల్లో వైసీపీ టికెట్‌పై పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికలలో మళ్లీ బరిలోకి దిగిన వెంకరమణి రెడ్డి విజయం సాధించారు. ప్రస్తుతం వైసీపీ, కాంగ్రెస్, ఎన్డీయే మధ్య త్రిముఖ పోటీ జరుగబోతోంది.

తిరుపతిలో అందరూ వైసీపీ అభ్యర్థులే

- ఓటర్లు ఆలోచించి తీర్పు ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విజ్ఞప్తి

విశాలాంధ్ర-తిరుపతి:
తిరుపతిలో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ వైసీపీకి చెందిన వారేనని, ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి తీర్పు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి తరపున సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.మురళిని గెలిపించాలని కోరుతూ తిరుపతిలో శనివారం భారీ రోడ్ షో నిర్వహించారు. మొదట బాలాజీ కాలనీలోని జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాజీ కాలనీ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ప్రకాశం రోడ్డు, గాంధీ రోడ్డు, నాలుగు కాళ్ల మండపం, తిలక్ రోడ్డు మీదుగా పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు రోడ్డు షో నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ ఇతర నియోజకవర్గాలకు భిన్నంగా తిరుపతిలో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. తిరుపతి అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్న అభినయ్ రెడ్డి (వైసీపీ), ఆరణి శ్రీనివాసులు (జనసేన)... పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న మద్దిల గురుమూర్తి (వైసీపీ), వి.వరప్రసాదరావు (బీజేపీ)...ఈ నలుగురూ వైసీపీకి చెందిన వారేనన్నారు. వైసీపీలో బాగా డబ్బు సంపాదించుకుని ఆరణి శ్రీనివాసులు జనసేన తరపున, వరప్రసాద రావు బీజేపీ తరపున పోటీ చేస్తున్నారన్నారు. వీరి నలుగురిలో ఎవరు గెలిచినా బీజేపీకి మద్దతుగా నిలుస్తారని రామకృష్ణ చెప్పారు. అందుకే తిరుపతి ఓటర్లు ఆలోచించి తీర్పు ఇవ్వాలని కోరారు. శ్రామికవర్గం కోసం పని చేసే ఇండియా కూటమి అభ్యర్థులు పి.మురళి, డాక్టర్ చింతామోహన్‌ను గెలిపించాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో ఓటుకు రూ.5 వేలతో కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యారన్నారు. ఇక పోస్టల్ బ్యాలెట్‌కు రూ.6 వేలతో కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జనసేన, వైసీపీ ఓట్లు కొనుగోలు చేస్తూ ఎన్నికలను వ్యాపారమయం చేస్తున్నాయని రామకృష్ణ మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.10వేల కోట్లు ఖర్చు చేయడానికి ప్రధాన పార్టీలు సిద్ధమయ్యాయన్నారు. డబ్బు ఉన్న వారు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, ప్రధాన పార్టీలు కూడా వారికే టికెట్లు ఇస్తున్నాయని చెప్పారు. సామాన్యులు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేదన్నారు.

నరేంద్రమోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంబానీ, అదానీలకు ఊడిగం చేస్తున్నారని, కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. ఎన్నికల బాండ్ల రూపంలో వేలకోట్లు తీసుకొని...కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు చేస్తున్నారన్నారు. ప్రధాని మత ప్రాతిపదికన ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. అందుకే ప్రజలందరూ ఆలోచించాలని ఆయన కోరారు. దేశాన్ని కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా 28 రాజకీయ పార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడ్డాయన్నారు. దేశ భవిష్యత్తు కోసం ప్రజలందరూ ఇండియా కూటమికి అండగా నిలవాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి జగన్ హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని రామకృష్ణ అన్నారు.

ఈ ఎన్నికల్లో ఓటర్లు జగన్‌కు గుణపాఠం చెప్పాలని ఆయన సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, రవీంద్రనాథ్, రాష్ట్ర సమితి సభ్యులు టి.జనార్దన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, చిన్ని రాజ్, సుధాకర్ రెడ్డి, ప్రభాకర్, నదియా, చలపతి, రవి, శశి, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు సుబ్రమణ్యం, లక్ష్మి, వేణు, బాలసుబ్రమణ్యం, కాంగ్రెస్ నాయకులు గోపాల్ రెడ్డి, నరసింహులు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

'జంగాల' విజయాన్ని కాంక్షిస్తూ భారీ రోడ్‌షో

విశాలాంధ్ర-గుంటూరు:
ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే నాయకులను రానున్న ఎన్నికలలో ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజావాణిని పార్లమెంట్‌లో వినిపించేందుకు గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. గుంటూరు నగరంలోని పాత గుంటూరు ప్రాంతంలో శనివారం సాయంత్రం ఇండియా కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షో నిర్వహించారు. పార్క్ సెంటర్ నుంచి కట్టావారి వీధి, సోమవారి వీధి, మణి హోటల్ సెంటర్, బాలాజీ నగర్ మీదుగా యాదవ బజార్ తదితర కాలనీల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం జరిగింది. రోడ్ షోలో టాప్ లేని వాహనంపై సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషాతో పాటు గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ నిలబడి ప్రజలకు అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు ఎర్రజెండాను చేతబూని ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ నినదిస్తూ వాహనాన్ని అనుసరిస్తూ ముందుకు సాగారు. జంగాల అజయ్‌కుమార్‌కు కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అజీజ్ పాషా మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

సీపీఐ విజయంతోనే రాజంపేట అభివృద్ధి

గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-రాజంపేట:
రాజంపేట అభివృద్ధి చెందాలంటే ఈనెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి బలపర్చిన సీపీఐ అభ్యర్థి బుక్కే విశ్వనాథ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య భవన నిర్మాణ కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలోని మారుతి ప్రసన్న వద్ద భవన నిర్మాణ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. టీడీపీ, వైసీపీ బూటకపు మేనిఫెస్టోలను నమ్మవద్దని, కంకి కొడవలికి ఓటు వేసి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడిని గెలిపించుకోవాలని కోరారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకు పోవడానికి తెలుగుదేశం, వైసీపీ ప్రభుత్వాలు కారణం కాదా అని ప్రశ్నించారు. రాజంపేట ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని, కనీసం ఈ ప్రాంతానికి మెడికల్ కళాశాల వస్తే ఆ కళాశాలను సైతం ఇక్కడి నాయకులు ఇతర ప్రాంతానికి తరలించారన్నారు. గాలేరి నగరి పూర్తి అయితే.. రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లోని రైతాంగం మూడు పంటలు వేసుకోవడానికి నీరందుతుందని, ఈ ప్రాంత ప్రజల తాగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. అటువంటి ప్రాజెక్టు పూర్తి చేయడానికి నిధులు కేటాయించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థుల్ని గెలిపించడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. రాజంపేటలో మెడికల్ కళాశాలతో పాటు డీమ్డ్ యూనివర్సిటీ ఏర్పాటు, ఉపాధి అవకాశాలు దొరక్క కువైట్, కతార్, దుబాయ్ లాంటి విదేశాలకు వలస పోతున్న యువత కోసం ఈ ప్రాంతంలో దొరికే సహజ వనరుల ద్వారా నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయించడానికి, ఇక్కడి ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ పట్టణ కార్యదర్శి సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ:
ఇండియా కూటమి బలపరుస్తున్న పత్తికొండ అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి పి.రామచంద్రయ్య ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. రామచంద్రయ్య ప్రచారానికి ప్రజల నుంచి రోజు రోజుకీ ఆదరణ పెరుగుతోంది. సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్‌తో కలిసి రామచంద్రయ్య పత్తికొండ పట్టణంలో బండిగేరి, చౌడమ్మ కాలనీ, ముస్లిం వీధి, చాకలి వీధి, సుంకం గేటు మీదుగా రామకృష్ణ నగర్, కోయనగర్, వడ్డేవీధి, స్టేట్ బ్యాంక్ సర్కిల్ కూడలి వరకు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట రాముడు, నాగరాజు, నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య, వాసు ప్రచారం ముందు వరుసలో నిలబడి రామచంద్రయ్యను గెలిపించాలని కోరుతూ ఆలపించిన గేయాలు పట్టణ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీలు నియోజకవర్గ అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయకపోగా... మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెడుతూ ఓట్లు అడిగేందుకు వస్తున్నారని విమర్శించారు. బీజేపీ, టీడీపీ, వైసీపీలను ఇంటికి సాగనంపుదామన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి తో పాటు పట్టణంలో రోడ్ల విస్తరణ, ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల నుండి 100 పడకల స్థాయికి పెంచడం, టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు, పత్తికొండ చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రామచంద్రయ్య కంకి కొడవలి గుర్తుకు, కర్నూలు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్ హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు దస్తగిరి, ప్రజాసంఘాల నాయకులు గుండు భాష, ఎంకే. సుంకన్న, అల్తాఫ్, రామచంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా' గెలుపుతో రాజ్యాంగ రక్షణ

- అక్కినేని వనజ పిలుపు
- విమల విజయం కోసం విశాఖలో భారీ ర్యాలీ

విశాలాంధ్ర-విశాఖ:
దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి, మత విద్వేషాలకు తావు లేకుండా ప్రజలు స్వేచ్ఛా, సౌభ్రాతృత్వాలతో మెలగడానికి ఇండియా కూటమి అభ్యర్థుల విజయం చారిత్రక అవసరమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఇండియా కూటమి నుంచి పోటీ చేస్తున్న సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల, విశాఖ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సత్యారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పశ్చిమ నియోజకవర్గంలో బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంకు వరకు శనివారం మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అక్కినేని వనజ మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం దేశాన్ని తిరోగమనంలో నడిపిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అతి తక్కువ ధరకు ప్రైవేటు శక్తులకు కట్టబెడుతోందని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని అమ్మకానికి పెట్టిందన్నారు. విదేశాలకు తరచూ వెళ్లే ప్రధాని మోదీ...సభ్య సమాజం తలదించుకునే ఘటనలు జరిగిన మణిపూర్‌లో మాత్రం పర్యటించలేదని నిందించారు. తమను వ్యతిరేకించే శక్తులు, వ్యక్తులను జైలుకు పంపుతోందని అన్నారు. బీజేపీ కండువా కప్పుకుంటే పవిత్రులవుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వైసీపీ, తెలుగుదేశం పార్టీలు రాజకీయ స్వార్థంతో మోదీ ప్రభుత్వానికి మోకరిల్లుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల, విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సత్యారెడ్డి, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రాఘవేంద్రరావు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎంఏ బేగం, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, జిల్లా అధ్యక్షురాలు పద్మ, కాంగ్రెస్ మహిళా విభాగం నాయకురాలు రజియా బేగం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జీఎస్‌జే అచ్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను గెలిపించండి

ముఠా కార్మికుల కార్నర్ సభలో సీపీఐ 'పశ్చిమ' అభ్యర్థి కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ:
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయనీ, కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యలపై చట్ట సభల్లో ప్రశ్నించే కమ్యూనిస్టులను గెలిపించాలని ఇండియా కూటమి బలపరిచిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం భవానీపురం ఐరన్ యార్డ్ ముఠా కార్మికులతో ఆయన కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల కోసం డబ్బులు ఖర్చు చేసే వారిని గెలిపిస్తే... ఆ తరువాత దానికి రెండింతలు సంపాదించుకోవడంపైనే దృష్టి పెడతారన్నారు. బీజేపీ అభ్యర్థి గతంలో ఐరన్ యార్డులో షాపు పెట్టి ముఠా కార్మిక వ్యవస్థను రద్దు చేసేందుకు ప్రయత్నించారని గుర్తుచేశారు. బ్యాంకులకు రూ.5,700 కోట్లు ఎగవేశారంటూ సుజనాపై పరోక్షంగా ఆరోపించారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అధికార పార్టీ అభ్యర్థి కరోనా కాలంలో ఎవరికీ సహాయం చేయలేదన్నారు. తాను కార్పొరేటర్‌గా పని చేసిన కాలంలోనే ఐరన్ యార్డులో రోడ్లు, డ్రైయినేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. కరోనా కాలంలో ప్రజలకు సేవలు అందించానని పేర్కొన్నారు. తన గుర్తు 'కంకి-కొడవలి' పై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ సెంట్రల్ నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీహెచ్ బాబూరావుకు 'సుత్తి-కొడవలి-నక్షత్రం' గుర్తుపై, విజయవాడ తూర్పు అభ్యర్థి నాంచారయ్యకు, విజయవాడ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న వల్లూరు భార్గవ్‌కు 'హస్తం' గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి సీతారాములు మాట్లాడుతూ సుజనా చౌదరి గత చరిత్రను వివరించారు. గతంలో ఐరన్ యార్డులో షాపు పెట్టి హైదరాబాద్ నుంచి వర్కర్లను తెచ్చుకుంటానని ఇక్కడి ముఠా కార్మికులను దూరం పెట్టారన్నారు. నాడు ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు ఉద్యమించి లేబర్ కమిషనర్‌పై ఒత్తిడి తీసుకువచ్చినట్టు గుర్తు చేశారు. ఏఐటీయూసీ విజయవాడ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, బత్తు తిరుపతయ్య, కన్నె వెంకటేశ్వర్లు, కృష్ణ, కొండ, కబీర్ పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థి 'బండి' ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-ఏలూరు:
పేదలు, కార్మికులు, కష్టజీవుల బాగుకై నిరంతరం పోరాడే బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక వంగాయ గూడెం సెంటర్, గొల్లాయిగూడెం, మరదాని రంగారావు కాలనీ, అరుంధతిపేట, గులాబీతోట తదితర ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ప్రభాకర్ మాట్లాడుతూ సీపీఐ గెలుపు ఏలూరు నగర అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. బీజేపీ, వైసీపీ, టీడీపీ విధానాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో జగన్‌ను గద్దె దించాలన్నారు. ఎన్నికల సందర్భంగో ఇచ్చిన వాగ్దానాలు అధికారం చేపట్టిన తర్వాత విస్మరించి మోదీ ప్రజలకు తీరని ద్రోహం తలపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై రూ.40 వేల కోట్ల భారాన్ని మోపారని మండిపడ్డారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తుంటే రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ దానికి మద్దతు ఇవ్వడం దారుణం అన్నారు. శాసనసభలో నికరమైన, నిబద్ధతతో కూడిన ప్రజా ప్రతినిధులు అవసరం అని, అందుకే సీపీఐను గెలిపించి చట్టసభల్లోకి పంపాలని కోరారు. కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య గుర్తు హస్తం, ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అసెంబ్లీ అభ్యర్థి వెంకటేశ్వరరావు గుర్తు కంకి కొడవలిపై ఓట్లు వేసి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండేటి బేబి, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, మావూరి విజయ, ఎ.అప్పలరాజు, గేదెల నాగేశ్వరరావు, సీపీఎం నగర కార్యదర్శి పళ్ళెం కిషోర్, ఇస్సాకు పాల్గొన్నారు.

సీపీఐని గెలిపిస్తే చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తాం

కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి గాలి చంద్ర

విశాలాంధ్ర- కమలాపురం:
ఇండియా కూటమిని గెలిపిస్తే చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తామని కమలాపురం అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర విజ్ఞప్తి చేశారు. తనను, కడప పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలను గెలిపించాలని ఓటర్లకు విన్నవించారు. కమలాపురం నియోజకవర్గంలోని చెన్నూరు, చిన్నమాచుపల్లె, శేషయ్య గారి పల్లెలో సీపీఐ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించింది. సీపీఐ, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించింది. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ చెన్నూరు చక్కెర పరిశ్రమ చంద్రబాబు ప్రభుత్వంలో మూతపడిందని తెలిపారు. అప్పటినుండి ప్రతి ఎన్నికలో చెన్నూరు చక్కెర పరిశ్రమ తెరిపిస్తామని నాయకులు బూటకపు హామీ ఇస్తున్నారని, కానీ ఏ ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేసింది లేదన్నారు. రైతుల పక్షాన, కార్మికుల పక్షాన పోరాటం చేసే సీపీఐ... చెన్నూరు పరిశ్రమ కోసం అనేక పోరాటాలు చేసిందని, ఇప్పుడు అసెంబ్లీ అభ్యర్థిగా గెలిపిస్తే చట్టసభలలో గట్టిగా మాట్లాడి పరిశ్రమను తెరిపిస్తానని హామీ ఇచ్చారు.

ఎర్రజెండాను ఆదరించండి

సీపీఐ అభ్యర్థి మురళి విజయాన్ని కాంక్షిస్తూ నగరంలో ప్రచార జోరు

విశాలాంధ్ర-తిరుపతి:
పేదల బతుకులు బాగు పడాలంటే ఎర్రజెండాను ఆదరించాలని ఇండియా కూటమి నేతలు పిలుపునిచ్చారు. తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి పి.మురళి విజయాన్ని కాంక్షిస్తూ నగర పరిధిలోని లెనిన్ నగర్, ప్రగతి నగర్, గరుడాద్రి నగర్, పార్వతీపురం, నారాయణపురం, కొరమేనుగుంట ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఏపీలో అక్రమాలు, భూ కబ్జాలు, దౌర్జన్యాలు పెరిగి పోయాయని ధ్వజమెత్తారు. లెనిన్‌నగర్ అభివృద్ధిలో కమ్యూనిస్టు నేతల కృషి మరువలేనిదన్నారు. పేదల రక్షణకోసమే కమ్యూనిస్టు పార్టీ పోటీ చేసిందని చెప్పారు. బూర్జువా పార్టీలకు ఓట్లు వేయడం వలన పేదల బతుకులు బాగుపడవన్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్ మాట్లాడుతూ ఎన్నికలు చాలా కీలమైనవని, పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఓటర్లు తీర్పు ఇవ్వాలని కోరారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ బీజేపీ దోపిడీకి జగన్ అండగా ఉన్నందునే జైలుకు పోకుండా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారని ఆరోపించారు. మోదీకి మద్దతు ఇస్తామని జగన్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటాచలం మాట్లాడుతూ ఏపీకి రాజధాని లేకపోవడం బాధాకరమన్నారు. జీఎస్టీ పేరుతో పాలకులు పేదలపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఇండియా కూటమి తరపున బీజేపీని ఎదిరిస్తామన్నారు. జగన్ గెలిచినా మోదీకి సాగిలపడతారన్నారు. ఏపీ ప్రజల హక్కులు కాలరాయడానికే టీడీపీ, వైసీపీ మోదీ భజన చేస్తున్నాయని మండిపడ్డారు. ఇది కాషాయ జెండాకు... ఎర్రజెండాకు మధ్య జరుగుతున్న పోరాటమన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి మంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సెంటు భూమి అని చెప్పిన జగన్... ఎంతమందికి ఇచ్చారో చెప్పాలన్నారు. వైసీపీ నేతలు వందల ఎకరాలు కబ్జా చేశారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, రాష్ట్ర సమితి సభ్యుడు టి. జనార్ధన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, చిన్నిరాజ్, సుధాకర్ రెడ్డి, ప్రభాకర్, చలపతి, రవి, సీపీఎం నేత సుబ్రహ్మణ్యం, లక్ష్మి, వేణు, బాలసుబ్రమణ్యం, కాంగ్రెస్‌నేత నరసింహులు, జిలానీ పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు గుర్రప్ప, నాగరాజు, సూరి, బాలయ్య ఆలపించిన గేయాలు ఓటర్లను ఆకట్టుకున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.